
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



శ్రీ పొట్టిశ్రీరాములు
# నెల్లూరు
జిల్లా వార్తలు

బుధవారం 18 డిసెంబరు 2024


## 'సోమశిల'కు 3వేల క్యూసెక్కుల వరద



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 3,004 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 72.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.






నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో ప్రమాణం చేయిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ

# కోటంరెడ్డి అనే నేను..

- నుడా చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ
- పాల్గొన్న మంత్రుల ఫరూఖ్, ఆనం, నారాయణ
- నగరంలో భారీగా బైక్ ర్యాలీ ● నటుడు బాలకృష్ణ అభినందనలు

7లో..

'కోటంరెడ్డి అనే నేను..' అంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నూడా చైర్మన్‌గా మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. నెల్లూరులోని నుడా కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూఖ్, ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. నుడా అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని మంత్రులు స్పష్టం చేశారు. అంతకుముందు నర్తకీ సెంటర్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాగా, హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ కోటంరెడ్డికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

# నేటి నుంచి డిపార్టుమెంటల్ పరీక్షలు

- మూడు కేంద్రాల్లో నిర్వహణ
- పకడ్బందీ ఏర్పాట్లు : డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు డిపార్టుమెంటల్ పరీక్షలు జరుగుతాయని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఉదయ భాస్కర్‌రావు తెలిపారు. ఈ పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం అధికారులతో ఆయన చాంబర్‌లో సమీక్ష జరిపారు. పరీక్షలు నెల్లూరులోని అయాన్ డిజిటల్ జోన్‌లో, కావలిలో ని పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో, రామిరెడ్డి సుబ్బరామి రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంట ల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం పరీక్షకు 8.30 నుంచి 9.15 గంటల్లోగా, మధ్యాహ్నం పరీక్షకు 1.30 నుంచి 2.15లోగా హాజరు కావాల న్నారు. హాల్‌టిక్కెట్, ఏదైనా ఫొటో ఆధారిత ధ్రువపత్రం తీసుకుని రావాలని సూచించారు. మొబైల్ ఫోన్లు నిషిద్ధమని తెలిపారు.

# పేలనున్న భూ బాంబ్!


- జనవరి 1 నుంచి మార్కెట్ విలువల పెంపు
- నివేదిక సిద్ధం చేసిన రిజిస్ట్రేషన్ శాఖ

రాష్ట్ర ఖజానాకు ఆదాయమే పరమావధిగా కూటమి ప్రభుత్వం భూ విలువల పెంపునకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేయగా, రిజిస్ట్రేషన్ అధికారులు కూడా పెంపు నివేదికలు తయారు చేశారు. ఈనెల 20న పెంచిన మార్కెట్ విలువలను నోటీసు బోర్డుల్లో ఉంచుతారు. 24 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, 26న వాటిని పరిశీలిస్తారు. 27న తుది జాబితాకు జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలుపుతుంది. ఆ తర్వాత జనవరి 1న పెరిగిన విలువలు అమలులోకి వస్తాయి.

**పెరగనున్న విలువలు ఇలా..**

(చదరపు గజం, రూ.లలో)

| ప్రాంతం | ప్రస్తుతం | పెంపు |
|---|---|---|
| నెల్లూరులో... | | |
| ట్రంకురోడు | 46,000 | 51,000 |
| వీఆర్సీ సెంటర్ | 38,000 | 42,000 |
| పొగతోట | 38,000 | 42,000 |
| హరనాథపురం | 14,300 | 16,000 |
| రామలింగాపురం | 23,000 | 26,000 |
| పెద్దబజారు | 38,000 | 42,000 |
| డైకస్‌రోడ్డు | 11,500 | 13,000 |
| పొట్టేపాళెం | 2,500 | 3,250 |
| స్టోన్‌హౌస్‌పేట | 28,000 | 11,500 |
| బాలాజీనగర్ | 15,000 | 16,500 |
| ధనలక్ష్మీపురం | 4,000 | 5,500 |
| బుజబుజనెల్లూరు | 3,700 | 5,000 |
| కాకుటూరు | 2,700 | 3,600 |
| కల్లూరుపల్లి | 6,000 | 7,200 |
| కావలి (మెయిన్) | 30,000 | 35,000 |
| ముసునూరు | 10,000 | 11,500 |
| మద్దూరుపాడు | 6,000 | 7,000 |
| గౌరవరం | 5,000 | 6,000 |
| కోవూరు | 3,500 | 4,000 |
| పడుగుపాడు | 4,700 | 5,000 |
| ఇనమడుగు | 2,500 | 3,000 |
| ఆత్మకూరు | 5,000 | 6,000 |
| అనంతసాగరం | 800 | 1000 |
| ఏఎస్‌పేట | 1,100 | 1,400 |
| ముత్తుకూరు | 10,000 | 11,500 |
| **భూములు (ఎకరా, రూ.లక్షల్లో)** | | |
| నెల్లూరు | | |
| కొండాయపాళెం | 81 | 105 |
| కనుపర్తిపాడు | 21.25 | 27 |
| దేవరపాళెం | 9.46 | 12.30 |
| పొట్టేపాళెం | 48.15 | 63.37 |
| కావలి | | |
| కావలి బిట్ వన్ | 53 | 60.75 |
| గౌరవరం | 7.70 | 8.86 |



నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 17 : నూతన సంవత్సర కానుకగా కూటమి ప్రభుత్వం భూముల, స్థలాల మార్కెట్ విలువలను పెంచనుంది. ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ ఎంవీ శేషగిరిబాబు నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖ అధికారులు నివేదికలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. భూములు, స్థలాల విలువలు బహిరంగ మార్కెట్‌లో అధికంగా ఉండగా, రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువ చాలా తక్కువగా ఉంటోంది. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకొని ఈసారి మార్కెట్ విలువలను జిల్లాలో 10 నుంచి 35 శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు తగ్గట్టుగా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నివేదికలు తయారు చేసినట్లు తెలిసింది. ఆర్డీవోలను, నుడా అధికారులను సంప్రదించి విలువల పెంపునకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మార్కెట్ విలువల కమిటీ రెండుసార్లు సమావేశమవగా తయారు చేసిన నివేదికలపై చర్చించారు. మార్కెట్ విలువలు పెంపు వల్ల ప్రజల్లో వ్యతిరేకత కాకుండా చూడాలనే అంశమై చర్చ సాగినట్లు తెలుస్తోంది. అంతేగాక మార్కెట్ విలువలు పెంచితే ప్రభుత్వానికి భూమి అవసరమైనప్పుడు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని నివేదిక

- మిగతా 6లో..

భూ ఆక్రమణలు జరగకుండా

# ల్యాండ్ గ్రాబింగ్ చట్టం

- త్వరలో అమలులోకి తెస్తాం ● అధికారుల సమీక్షలో మంత్రి ఫరూక్

నెల్లూరు హరనాథపురం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూ ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొచ్చిందని, ఇందుకు నియమ నిబంధనలను రూపొందిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జరిగిన అధికారుల సమీక్షలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తప్పులు, భూకబ్జాలతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. సుమారు రూ.10 లక్షల కోట్లకుపైగా అప్పులు మిగిల్చి పోయారన్నారు. ఆ అప్పులకు అసలు, వడ్డీ, చెల్లించాల్సి వస్తుందని, వీటిని సరిచేసుకోవడానికే తమకు సమయం సరిపోతోందన్నారు. ఆర్అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చడానికి జిల్లాకు రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జనవరి 15లోగా ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.67కోట్లతో 1157 సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో దేవదాయ శాఖ భూసమస్యల పరిష్కారానికి కూడా సత్వర చర్యలు చేపట్టాలని అన్నారు. ఉపాధి హామీ నిధుల కేటాయింపుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో చర్చించినట్లు చెప్పారు. రాష్ట్ర పశుపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ త్వరలోనే అమలులోకి వస్తుందని చెప్పారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయర్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో నీటిని అందించడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. 130 క్యూసెక్కుల నీటిని ఇస్తే చివరి ఆయకట్టుకు కూడా నీరు అందుతుందని చెప్పారు. ఇప్పటికే 100 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామని చెప్పారు. బ్యాకమ్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన జెర్మనీ కంపెనీతో చర్చించి రిజర్వాయర్ గేట్లను తెరిపించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ సమీక్షలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ఆలయాలకు శోభ

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి వెల్లడించారు. పది రోజుల తర్వాత తాను, మంత్రి నారాయణ ఇద్దరం నగరంలో తిరిగి నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ నూతన భవనంలో శిలాఫలకాలను మంత్రులు ఫరూక్, పొంగూరు నారాయణలతో కలిసి ఆనం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనం విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ఘాట్ పూర్తి చేయడంతోపాటు మూలాపేట వేణుగోపాల్‌స్వామి ఆలయాన్ని పునఃనిర్మించనున్నట్లు చెప్పారు. నగరాలు, పట్టణాలలో ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకొని దేవస్థానాల నిధులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, కురుగొండ్ల రామకృష్ణ, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ప్రాంతీయ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, ఉప కమిషనర్ కేబీ.శ్రీనివాసరావు, జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, వివిధ ఆలయాల ఈవోలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఆనం, ఫరూఖ్, నారాయణ, ఎమ్మెల్యేలు తదితరులు

# రెండు రోజులు భారీ వర్షాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఓ ఆనంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తీర ప్రాంత ప్రజలు, పెన్నానది పరీవాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళవద్దని, బోట్లు, వలలు జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామని, వర్షాల వల్ల ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే నెంబరు 0861-2331261కు తెలియజేయాలని కోరారు. అధికార యంత్రాంగం అంతా హెడ్‌క్వార్టర్స్‌లో ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రశాంతంగా డీసీ ఎన్నికలు

- 13 కమిటీలూ కూటమి నేతల కైవసం ● 21న పీసీ ఎన్నికల నిర్వహణ

నెల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల (డీసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఇటీవల ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు వారి పరిధిలోని డీసీ కమిటీలను ఎన్నుకున్నారు. మొత్తం 13 డీసీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఎన్నిక జరగ్గా, అన్నీ ఏకగ్రీవం అయ్యాయి. అన్నిటినీ కూటమి నేతలే దక్కించుకున్నారు. పెన్నా డెల్టాలో పరిధిలో ఎనిమిది డీసీలు, సోమశిల ప్రాజెక్టు పరిధిలో ఐదు డీసీలు ఉన్నాయి. సదరన్ చానల్ డీసీ అధ్యక్షుడిగా జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నెల్లూరు రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఈస్టర్న్ చానల్-1 డీసీ అధ్యక్షుడిగా బత్తల హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా జొన్న శివకుమార్, ఈస్టర్న్ చానల్-2 డీసీ అధ్యక్షుడిగా పాశం శ్రీహరిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా అడపాల జనార్దన్‌రెడ్డి, పైడేరు ఎస్కేప్ చానల్ డీసీ-1 అధ్యక్షుడిగా రేబాల శంకర్షన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అల్లం రాధాకృష్ణయ్య, పైడేరు ఎస్కేప్ చానల్ డీసీ-2 అధ్యక్షుడిగా బీద గిరిధర్, ఉపాధ్యక్షుడిగా మేడా కృష్ణారెడ్డి, నెల్లూరు సప్లై చానల్ డీసీ అధ్యక్షుడిగా ఈ శివనారాయణ, ఉపాధ్యక్షుడిగా చెవిరెడ్డి అశోక్‌రెడ్డి, సర్వేపల్లి కెనాల్ డీసీ అధ్యక్షుడిగా చల్లా నాగార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆలూరు వెంకట విష్ణువర్ధన్‌రావు, జాఫర్ సాహేబ్ కెనాల్ డీసీ అధ్యక్షుడిగా సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడిగా దేవిరెడ్డి రవీంద్రరెడ్డి ఎన్నికయ్యారు. ఇక సోమశిల పరిధిలోని సౌత్ ఫీడర్ చానల్ డీసీ అధ్యక్షుడిగా వేలూరు కేశవులు చౌదరి, ఉపాధ్యక్షుడిగా చల్లా విజయభాస్కర్‌రెడ్డి, నార్త్ ఫీడర్ చానల్ డీసీ అధ్యక్షుడిగా మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పునుగుంట ధనుంజయ, కావలి కెనాల్ రీచ్-1 డీసీ అధ్యక్షుడిగా కండ్లగుంట మధుబాబు, ఉపాధ్యక్షుడిగా పులి శీనయ్య, కావలి కెనాల్ రీచ్-2 డీసీ అధ్యక్షుడిగా వంటేరు జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మలినేని హరిబాబు, కావలి కెనాల్ రీచ్-3 డీసీ అధ్యక్షుడిగా పులుగుంట మధుమోమన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పులిమి విజయభాస్కర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కాగా ప్రాజెక్టు కమిటీలకు 21వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. డీసీల అధ్యక్షులు వారి ప్రాజెక్టు కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. జిల్లాలో రెండు మేజర్ పీసీలు పెన్నా డెల్టా, సోమశిల ప్రాజెక్టులతో పాటు మీడియం పీసీలు కనుపూరు కెనాల్, గండిపాలెం ప్రాజెక్టు, రాళ్లపాడు ప్రాజెక్టు, వీఆర్‌కోట ఆనికట్ సిస్టమ్ ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి.

# ఇసుక ధరకు రెక్కలు

- సిండికేట్‌గా మారుతున్న ట్రాక్టర్ల యజమానులు
- నెల్లూరు నగరంలోనే ట్రక్కు రూ.2500
- టిప్పర్ ధరతో పోలిస్తే రూ.వెయ్యి అదనం
- మంత్రి నారాయణ ఆదేశాలు బేఖాతరు
- అధికారుల పర్యవేక్షణ అంతంతే!

ఇసుక ధరలకు మళ్లీ రెక్కలొస్తున్నాయి. ఉన్నత లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితం చేయగా.. రవాణాదారులు మాత్రం ఇదే తమకు అవకాశంగా మలుచుకుంటున్నారు. కేవలం రవాణా చార్జీలు మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా రెట్టింపు వసూలు చేస్తున్నారు. టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్న ధరకు, ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తున్న ఇసుక ధరకు భారీ వ్యత్యాసం ఉంటోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఉచితంగా ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చింది. చిన్నస్థాయి వ్యక్తులకు కూడా సులభంగా ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తే.. ఇదే అదునుగా ట్రాక్టర్ల యజమానులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. నెల్లూరులో ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుకను రూ.2500 వరకూ విక్రయిస్తున్నారు. మొదట్లో ఇది రూ.1500 ఉండేది. అలాగే టిప్పర్ ద్వారా ఇసుకను సరఫరా చేసిన వ్పుడు యూనిట్ ధర రూ.2500 వరకూ పలికేది. ఆ తర్వాత అధికారులు తీసుకున్న చర్యలతో ఇప్పుడు ఆ ధర రూ.1500లకు దిగొచ్చింది. కానీ ఇందుకు భిన్నంగా ట్రాక్టర్ ధర మాత్రం రూ.1500 నుంచి రూ.2500లకు పెర గడం గమనార్హం. టిప్పర్లపై దృష్టి పెట్టిన అధికారులు ఫలితం సాధిం చారు. కానీ ట్రాక్టర్లపై నియంత్రణ లేకపోవడంతో వారు చెప్పిందే ధరగా మారిపోయింది. పెన్నాలో ట్రాక్టర్ ఇసుకను లోడింగ్ చేసేందుకు రూ.500 తీసుకుంటున్నారు. మొదట్లో ఇది రూ.300 ఉండేది. ఇక్కడే రూ.200 పెంచారు. ఇక రవాణా చార్జీలు, ఆదాయం కలుపుకుంటే మరో రూ.వెయ్యి అవుతుంది. మొత్తంగా రూ.1500లకు ఒక ట్రాక్టర్ (యూనిట్) సరఫరా చేసేందుకు వీలుంది. కానీ ట్రాక్టర్ యజమానులు రూ.500 నుంచి 1000 వరకూ పెంచారు. ఈ ధరను మరింత తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గతంలో మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలు కూడా ఇచ్చారు. అయితే అందుకు వ్యతిరేకంగా ధరలు పెరుగుతున్నాయి.

**● సమీక్షించకపోతే కష్టం**

ప్రస్తుతం యార్డుల్లో యూనిట్ ఇసుకను రూ.వెయ్యికు విక్రయిస్తున్నారు. ఒక టిప్పర్ ఏడు యూనిట్లను రూ.7 వేలకు కొనుగోలు చేసి దానికి రవాణా చార్జీలు మరో రూ.4 వేల నుంచి రూ.4500 కలుపుకొని నెల్లూరులో రూ.11 వేల నుంచి రూ.11,500 మధ్యలో విక్రయిస్తున్నారు. అదే ఏడు యూనిట్లను ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు చేయాలంటే రూ.15 వేలు అవుతోంది. సామాన్యులకు ఇది భారంగా మారింది. నిత్యం వందల ట్రాక్టర్లు పెన్నా నుంచి ఇసుకను తీసుకెళుతున్నాయి. ఇటీవల ఈ ట్రాక్టర్ల యజమానులంతా సిండికేట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అన్‌సీజన్ అయినా ధర పెరుగుతోందంటే ఇక రానున్న రెండు మూడు నెలల్లో సీజన్ ప్రారంభమైతే ఇంకెంత ధరలు పెరుగుతాయోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఉచిత ఇసుక పాలసీ అమలు తీరుపై జిల్లా అధికార యంత్రాంగం సమీక్షించడం లేదు. ఈ కారణంగా క్షేత్ర స్థాయిలో ఇసుక ధరలపై నియంత్రణ ఉండటం లేదు. పెన్నాలో లోడింగ్ దగ్గర నుంచి ట్రాక్టర్ల రవాణా చార్జీల వరకూ అధికారులు సమీక్షించకపోతే రానున్న రోజుల్లో ఇసుక ధరలు మరింత పెరిగే ప్రమాద ముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**● మన్నేరు ఇసుకకు డిమాండ్**

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణం, పరిసర ప్రాంతాలలో మన్నేరు ఇసుకకు డిమాండ్ ఏర్పడటంతో ట్రాక్టర్ల యజమానులు అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలో పాలేరు, మన్నేరు, ఉప్పుటేరులలో ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇందులో పాలేరు కందుకూరుకు అతి సమీపంలో ఉండగా మన్నేరు నుంచి ఇసుక తరలించాలంటే కొంత దూరం పెరుగుతుంది. అయితే నాణ్యతపరంగా మన్నేరు ఇసుకకు డిమాండ్ ఉండటంతో దూరాన్ని ఆసరాగా చూపించి అదనంగా వసూలు చేస్తున్నారు. పాలేరు నుంచి కందుకూరుకు ట్రక్కు ఇసుక రూ.1500లకు తోలుతుండగా మన్నేరు నుంచి మాత్రం ట్రక్కుకు రూ.2100 నుంచి 2300 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మన్నేరు నుంచి ఇసుక తేవాలంటే రాను పోను పాలేరుకన్నా రమారమి 30 కి.మీ దూరం పెరుగుతుందని చెబుతూ అదనంగా వసూళ్లు చేస్తున్నారు. కాగా మన్నేరు పరివాహక గ్రామాల ప్రజలు సైతం ఏటిలోకి వెళ్లే మార్గాల వద్ద ట్రాక్టర్ల నుంచి నగదు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

# పుత్రశోకం!

బడికి వెళుతున్న తన అన్నకు టాటా చెప్పేందుకు రెండేళ్ల చిన్నారి ఇంట్లో నుంచి బుడిబుడి అడుగులు వేసుకుంటూ బయటకు వచ్చి స్కూలు వ్యాను ముందు నిల్చున్నాడు. ఇది గమనించని డ్రైవర్ వాహనాన్ని కదిలించడంతో పసిప్రాణం చక్రాల కింద నలిగిపోయి విలవిలకొట్టుకుంది. కళ్లెదుటే కుమారుడు విగతజీవిగా మారడంతో ఆ తండ్రి రోదన మిన్నంటింది. కందుకూరు మండలం అనంతసాగరంలో మంగళవారం ఉదయం ఈ విషాదం చోటు చేసుకుంది.

- స్కూలు వ్యాను కింద నలిగిన చిన్నారి ప్రాణం
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు

కందుకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతసాగరం గ్రామానికి చెందిన గోగినేని శ్రీకాంత్ పెద్ద కుమారుడు (5) పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కి వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం కుమారుడ్ని స్కూలు వ్యాన్ ఎక్కించేందుకు శ్రీకాంత్ వెళ్లాడు. వీరివెంటే బుడిబుడి అడుగులు వేసుకుంటూ వెళ్లిన చిన్న కుమారుడు వ్యాన్ ముందు నిల్చున్నాడు. ఆ చిన్నారిని ఎవరూ గమనించకపోగా డ్రైవర్

- మిగతా 6లో..



వ్యాన్ కింద పడి మృతి చెందిన రెండేళ్ల బాబు

## మొదటి చాటింపు వచ్చిందోచ్..



ఈ నెల 31న జరుగనున్న స్థానిక గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మల తిరునాళ్లకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తొలి చాటింపు వేయించారు. అంతకుముందు ఊరు ప్రజలు పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని గ్రామ పెద్దకాపు నలగట్ల మహేష్‌రెడ్డి, పెద్ద గొల్ల మేగ సుబ్బయ్య, పెద్ద మాదిగ ఈపూరు బ్రహ్మయ్యలతో పాటు అన్ని కులాల పెద్దలు చేరుకొని ఈ చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అనంరాజు బాలకృష్ణంరాజు, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, కత్తుల విజయకుమార్ ఉన్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

## విద్యుత్‌ను వృథా చేయొద్దు

నెల్లూరు (జడ్పీ), డిసెం బరు 17 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్‌ను వృథా చేయ వద్దని, దేశాభివృద్ధి విద్యుత్ వినియోగంపై ఆధారపడి ఉందని, దీనిని ప్రతి ఒక్క రూ అవగాహన చేసుకోవా ల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నెల్లూరులోని విద్యుత్ భవన్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. దీనిని జేసీ ప్రారంభించి ప్రసంగించారు. విద్యుత్ వృథాను అరికట్టి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ పొదుపుపై గ్రామస్థాయి నుంచి అవగా హన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పా రు. స్టార్ రేటింగ్ పరికరాల ద్వారా విద్యుత్‌ను పొదుపు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శేషాద్రి బాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





## తిరుమల ప్రత్యేక దర్శన టికెట్లు కేటాయించండి

• రాష్ట్ర మంత్రులతో తమిళనాడు మంత్రి రాజేంద్రన్ భేటీ

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు తిరుమల ప్రత్యేక దర్శన టిక్కెట్లను కేటాయించాలని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణలను తమిళనాడు పర్యాటకాభివృద్ధి శాఖ మంత్రి రాజేం ద్రన్ కోరారు. ఆయన మంగళవారం నెల్లూరులో మంత్రి రామ నారాయణరెడ్డి ఇంటికి విచ్చేశారు. తమిళనాడు టూరిజం శాఖకు 1974 నుంచి తిరుమల దర్శనానికి స్పెషల్ ఎంట్రీ టిక్కెట్లు ఇస్తు న్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం టీటీడీ బోర్డు అన్ని కార్పొరేషన్లకు తీర్థ దర్శన కోటాను రద్దు చేసిందని, దీని పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విష యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి ఆనం సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రులు ఆనం, నారాయణ, ఫరూక్‌తో తమిళనాడు మంత్రి రాజేంద్రన్

## బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో బెల్టు దుకాణాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి వద్ద మద్యం విక్రయిస్తున్న ఎర్రకట్ట సంఘానికి చెందిన ఏ వెంకయ్యను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 9 క్వార్టర్ సీసాల మద్యం స్వాధీనం చేసుకు న్నారు. ఇర గాళమ్మ సంఘం సమీపంలోని బస్సు షెల్టర్ వద్ద అదే ప్రాంతానికి చెందిన రామకృష్ణను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 15 క్వా ర్టర్ల మందు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ బెల్టు దుకాణాలు నిర్వహి స్తున్న వారి సమాచారాన్ని ప్రజలు తెలియజేయాలని కోరారు.

## పుత్రశోకం!


(5వ పేజీ తరువాయి)


కూడా చూసుకోకుండా వ్యాన్‌ను కదిలించటంతో చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నారి మృతదేహానికి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ముక్కుపచ్చలారని చిన్నారిని వ్యాన్ రూపంలో మృత్యువు కబలించటంతో అనంతసాగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పేలనున్న భూ బాంబ్!


(5వ పేజీ తరువాయి)


తయారు చేస్తున్నారు. జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాలలో అంకణం విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేలు, లక్షల్లో ఉంటోంది. ఇక ఎకరా భూమి రూ.కోట్లు పలుకుతోంది. అయితే, రిజిస్ట్రేషన్‌శాఖ మార్కెట్ విలువలు మాత్రం రూ.వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో భూముల మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో చాలా ప్రాంతాలలో వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మారుస్తూ భూమార్పిడి జరిగింది. జిల్లా అంతా దాదాపుగా నుడా పరిధిలో ఉంది. మార్కెట్ విలువలకు సంబం దించిన అన్ని అంశాలపై తుది నివేదిక తయారైంది. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాలలో రెండేళ్లకొకసారి రిజిస్ట్రేషన్ విలు వలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కూడా ఈ విలువలు పెరగనున్నాయి. జనవరి 1వ తేదీన ఈ పెంపు అమలులోకి వస్తుంది. ఈనెల 20న పెంచిన మార్కెట్ విలువలను నోటీసు బోర్డులలో ఉంచుతారు. 24 వరకు ప్రజల అభ్యంతరాలు స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలించి, 27న తుది జాబితాకు జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలుపుతుది. ఆ తర్వాత జనవరి 1న పెరిగిన విలువలు అమలులోకి వస్తాయి.

## నేడు ఎల్‌టీ, ఫార్మాసిస్టల మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసు కున్న వారి మెరిట్ జాబితా బుధవారం విడుదల చేస్తు న్నట్లు డీఎం హెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు ల్యాబ్ టెక్నీషియన్, రెండు ఫార్మాసిస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే 19వ తేదీలోపు వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలో తెలియచేయాలని కోరారు.

## 'పది'కి వంద రోజుల ప్రణాళిక

• ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు • వెనుకబడిన విద్యార్థులపైనే ప్రత్యేక దృష్టి

నెల్లూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పదోతరగతి తొలిమెట్టు. ఇందులో తన 'మార్క్' చూపాలని ప్రతి విద్యార్థి ఆశిస్తుంటాడు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లోని చాలా మంది విద్యార్థులు గట్టెక్కలేకపోయినట్లు గణాంకాలు కూడా తెలుపుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టెన్త్‌పై ప్రత్యేక దృష్టి సారించి, పది విద్యార్థులు అత్యున్నతంగా రాణించేలా కార్యాచరణ సిద్ధం చేసింది. మారిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటుతో తాత్కాలిక ఏర్పాట్లు చేసింది. పరీక్షల షెడ్యూల్ కూడా విడుదల కావడంతో డిసెంబరు నుంచి మార్చి వరకు వందరోజుల ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశాలు వెలవడటంతో ఆ మేరకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.



• విద్యార్థుల లోపాలను గుర్తిస్తూ..

పదోతరగతి పరీక్షలను ఓ సమరంలా భావించి విద్యార్థులు సన్నద్ధమవుతుండగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తోడ్పాటు అందిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పరీక్షల షెడ్యూల్ ప్రకారం మార్చి 17వ తేదీన ప్రధాన పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సరిగ్గా మూడు నెలల వ్యవధి ఉండటంతో పక్కా ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు వందరోజుల ప్రణాళికలను అనుసరిస్తున్నారు. జిల్లాలో 30వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, వీరందరికీ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రోజుకో సబ్జెక్ట్‌లో పునఃశ్చరణ పరీక్షలు రాయిస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్ది విద్యార్థుల లోపాలను మెరుగుపరుస్తున్నారు. వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది టెన్త్ పరీక్షల విధానం కొంత మారింది. గత ఏడాది ఫిజికల్ సైన్స్, సోషల్‌స్టడీస్‌లు ఒకే ప్రశ్నపత్రంలో ఇచ్చారు. దీనివల్ల విద్యార్థులు తికమకకు గురయ్యారు. మూల్యాంకనంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఈ ఏడాది ఈ రెండింటినీ విడివిడిగా 50 మార్కుల చొప్పున నిర్వహించేందుకు టైంటేబుల్ ప్రకటించారు. అదే విధంగా విద్యార్థికి తమ ఇష్టానుసారం తెలుగు మాధ్యమంలోనూ పరీక్ష రాసే వీలు కల్పించారు.

### విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



టెన్త్ విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు పీరియడ్లు, స్టడీ అవర్స్ చేపట్టి రోజూ ఆరో పీరియడ్ లో పరీక్షల నిర్వహిస్తు న్నాం. సబ్జెక్ట్ నిపుణులు తయారు చేసిన ప్రశ్న పత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని నిత్యం విద్యార్థులతో రాయిస్తున్నాము. అంతేగాక టర్మ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల స్థాయిని నిర్ణయించి వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము. సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులు 6 నుంచి 8 మంది వరకు ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసు కుని మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దేలని ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థుల అంతర్గత మార్కుల వివరాలను తల్లిదండ్రులతో చర్చించి ప్రోగ్రెస్ కార్డులను అందిస్తున్నాము. అలాగే, ఇంటి దగ్గర కూడా పిల్లల్ని చదివించేలా దిశానిర్దేశం చేస్తున్నాము.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

## కోళ్ల వ్యర్థాల వాహనాల స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఇతర ప్రాంతాల నుంచి మండలంలోని కాగులపాడు గ్రామ శివారు నుంచి దామరమడుగుకు వెళ్లే మార్గంలో కోవూరు కాలువ వెంబడి ఉన్న చేపల గుంతలు, నెల్లూరు చంద్రారెడ్డి స్కూలు వెనుక చేపల గుంతలకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డిలు దాడులు నిర్వహించి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 'పది' విద్యార్థులకు రేపటి నుంచి ఎడిట్ ఆప్షన్

నెల్లూరు(విద్య), డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువు ముగిసిందని, దరఖాస్తులో తప్పులు సరిదిద్దుకునేందుకు పాఠశాల లాగిన్‌లో ఎడిట్ ఆప్షన్ ఈనెల 19 నుంచి 23వతేదీ వరకు అందుబాటులో ఉంటుందని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానోపాధ్యా యులు స్కూల్ రికార్డులు, ఆపార్ ఐడీ ఆధారంగా పరిశీలించి విద్యార్థులు మార్పులు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఈ ఆప్షన్‌లో విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, ప్రథమ, ద్వితీయ లాంగ్వేజ్‌లను మార్పు చేసుకోవడం, మీడియంను, పుట్టుమచ్చలను, ఫొటో మరియు సంతకాలతో పాటు మరికొన్ని అంశాలను ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

## చిట్టీల పేరుతో మోసం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చిట్టీల పేరుతో మోసగించిన వ్యక్తిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌లో ఆక్వా టెక్నీషియన్ నరేంద్ర నివసిస్తు న్నాడు. ఆయన మూలాపేటకు చెందిన చిరంజీవి వద్ద రూ.10 లక్షల చీటీ వేసి పదహారు నెలలు కట్టా రు. అనంతరం చీటీపాట పాడుకున్నారు. రెండు నెలలుగా చిరంజీవి ఫోన్ తీయకుండా సమా ధానం చెప్పకుండా తప్పించుకొని తిరుగుతు న్నాడు. తనలాగే పలువురిని మోసగించాడని తెలుసుకుని విషయాన్ని చిరంజీవి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు కొంత సమయం ఇస్తే డబ్బు కడతామని చెప్పడంతో కొంతకాలం వేచిచూశాడు. ఇటీవల నగదు కోసం గట్టిగా నిలదీయడంతో వారు అసభ్యకర పదజాలంతో దూషించారు. దీంతో బాధితుడు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పేదలకు ఆపన్నహస్తం.. సామాజిక చైతన్యం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మారుమూల పల్లెలో జన్మించిన ఆ యువకుడు ఆనాడు వసతి గృహంలో కడుపునింపుకొని చదువును సాగిస్తున్న తరుణంలో అప్పటి సమాజంలో నెలకొన్న అసమానతలు, బడుగు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించి పోయాడు. ఏనాటికైనా వాటిని రూపుమాపేందుకు తనవంతుగా పోరాడాలని సంకల్పించాడు. అనంతరం వాటికి రూపకల్పన చేస్తూ లార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించిన జడదేవి గ్రామానికి చెందిన నూనె ప్రసాద్ తన ఆలోచనలను ఆచరణ రూపంలో పెడుతూ నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సామాజిక చైతన్యం కోసం తనవంతుగా అడుగులు వేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 1990-91 కాలంలో జిల్లా కేంద్రాలు, పట్టణాలకే సంస్థలు పరిమితమైన కాలంలో తెలుత ఓ సంస్థలో ఆర్గనైజర్‌గా విధులు నిర్వర్తించిన ప్రసాద్ పల్లె ప్రాంతాలకు సైతం విస్తరింపచేయాలనే ఉద్దేశంతో 1993లో స్వతహాగా ఓ సంస్థను ప్రారంభించి ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. అందుకు ప్రతిఫలంగా 2006లో జరిగిన ఎన్నికల్లో గ్రామస్థులు ఆయన్ను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చినా కుటుంబ సభ్యులు అంగీకరిం చకపోవడంతో ఉద్యోగాన్ని సైతం వదులుకున్న ఆయన సేవా కార్యక్రమాలకే పరిమితం అయ్యారు.



వసతిగృహంలో చదువుకుంటున్న విద్యార్థినులు




ప్రజలకు అవగాహన కల్పిస్తూ..




అవార్డు అందుకున్న నూనె ప్రసాద్

- ప్రకాశం జిల్లా పామూరులో పేద విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాల ఏర్పాటు
- వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, పామూరు మండలాల్లో వయోజక విద్యా కేంద్రాలు ఏర్పాటు, జనన, మరణ నమోదుపై అవగాహన
- ఉదయగిరి మండలంలో మాతంగి నిర్మూలనపై చైతన్యం
- కావలి డివిజన్ పరిధిలో టీబీ, హెచ్ఐవీ, ఎయిడ్స్, ఫైలేరియా, కుష్ఠు తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.
- దుత్తలూరు మండలంలో తాగునీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన
- వరికుంటపాడు, దుత్తలూరు, పామూరు, సీఎస్‌పురం మండలాల్లో కోవిడ్-19 సమయంలో అవగాహన, ఆహారం సరఫరా
- దుత్తలూరు, పామూరు మండలాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి బోర్ల ఏర్పాటు
- వరికుంటపాడు మండలంలో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన
- దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ
- ఉదయగిరి కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహణ
- పలు మండలాల్లో సంచార జాతుల పిల్లల కోసం సాయంత్రం పాఠశాలల ఏర్పాటు
- ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలపై అవగాహన
- సర్పంచు, ఎంపీటీసీ, వార్డు సభ్యులకు విధులు, హక్కులపై అవగాహన
- ప్రతిఏటా ప్రత్యేక దినోత్సవాలు నిర్వహించి ప్రాముఖ్యతపై అవగాహన

### అందుకున్న అవార్డులు

పేదల కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన నూనె ప్రసాద్ అనేక అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకొని ఉన్నతాధికారులు, పలు సంస్థల ప్రతినిధుల నోట శభాష్ అనిపించుకుంటున్నారు.

- 2010లో హైదరాబాదులోని దళిత కళామండలి నిర్వహించిన కార్యక్రమంలో దేశ ఫెలోషిప్ అవార్డు అందుకున్నారు.
- 2014లో ఢిల్లీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు
- 2017లో చెన్నైలో జరిగిన ఆదిఆంధ్ర అరుంధతి మహాసభలో దళిత అవార్డు
- 2021లో కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా అవార్డు
- 2022లో చెన్నైలో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభలో అవార్డు
- అదే ఏడాది నెల్లూరులో బెస్టు సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నారు.
- 2024 ఆగస్టులో నెల్లూరులోనూ, డిసెంబరు 5న నెల్లూరులో నిర్వహించిన వరల్డ్ వలంటీర్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నారు.

### సంతోషంగా ఉంది



చిన్నప్పుడు నేను అనుభవించిన కష్టాలు ఇప్పటితరానికి దూరం చేయాలనే సంకల్పంతో కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉంది. నావంతు శక్తితోపాటు దాతల సహకారంతో సంస్థను కొనసాగిస్తున్నా. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నాం.

- నూనె ప్రసాద్, లార్డ్ సంస్థ అధ్యక్షుడు

## మహిళలతో అసభ్య ప్రవర్తన

• ఇద్దరిపై పోలీసు కేసు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించారన్న అభియోగంతో ఇద్దరు వ్యక్తులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని వాకర్స్ రోడ్డుకు చెందిన మహిళలు లక్కీ వైన్‌షాపునకు వ్యతిరేకంగా గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం లక్కీ వైన్‌షాపులో పనిచేస్తున్న ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేసుకుని తన మర్మాంగాన్ని ఆందోళన చేస్తున్న మహిళలకు చూపించి అసభ్యకరంగా సైగలు చేశాడు. అదే క్రమంలో షాపులోని క్యాష్ కౌంటర్‌లో ఉన్న మరో వ్యక్తి డబ్బు చూపిస్తూ సైగలు చేయడమేకాక వీడియోలు, ఫొటోలు తీశారని మహిళలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం దుకాణం క్యాషియర్‌పై దాడి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బ్రాందీషాపు క్యాషియర్‌పై దాడి ఘటనపై చిన్నబజారు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని అయ్యప్పగుడి సెంటర్ సమీపంలో ఉన్న టీచర్స్ కాలనీకి చెందిన కే శ్రీనివాసులు పరమేశ్వరీ నగర్‌లోని లక్ష్మీవైన్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. షాపు ప్రారంభమైన రోజు నుంచే కోటమిట్టకు చెందిన జాబేర్, జిలానీ, మరికొందరు దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలని ఆందోళన చేస్తున్నారు. దీనిపై శ్రీనివాసులు గతంలో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ రాత్రి శ్రీనివాసులు షాపులో ఉండగా జాబేర్, జిలానీ మరికొందరు దాడి చేశారు. మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. గాయాలపాలైన క్యాషియర్ మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని భక్తవత్సల నగర్ పెన్షన్ భవన్‌లో మంగళ వారం జాతీయ పెన్షనర్ల దినోత్స వం ఘనంగా జరిగింది. పెన్షనర్స్ సంఘం గౌరవాధ్యక్షుడు విరవు బాల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెన్షనర్స్ జెండా, 2025 పెన్షనర్స్ క్యాలెండరును ఆవిష్కరించారు. పెన్ష నర్స్ మూలపురుషుడు డీఎస్ నీకరా, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీఎస్ రామానుజాచార్యులు చిత్రపటాలకు పుష్పమాలలు వేసి నివాళులు అర్పించా రు. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ఉపాధ్యక్షులు గురు నాథం, కేఎస్ జ్ఞానరత్నం, ఖాజా రసూల్ ఉపన్యసిం చారు. జిల్లా ట్రెజరీ అధికారి మాట్లాడుతూ గంగాద్రి మాట్లాడుతూ పెన్షనర్స్ 2025 ఫిబ్రవరి 25లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. కలెక్టరేట్, బాలాజీనగర్, మూలాపేటలో లైఫ్ సర్టిఫికెట్ల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరా డెంటల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ కే వివేకానంద వృద్ధాప్యంలో దంత సమస్యలు, నివారణ చర్యలను వివరించారు. అనంతరం 30 మంది సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి, కోశాధికారి హజరత్తయ్య, వైస్ ప్రెసిడెంట్ వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అనంతరం సీనియర్ పెన్షనర్లతో నాయకులు

# రహదారులే కళ్లాలు !

ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వరికుంటపాడు మండలంలోని జీ.కొండారెడ్డి పల్లిలో 120 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేర పంట నష్టం జరిగింది. కోత కోసిన మిగిలిన వరి ధాన్యాన్ని ఆరబోసుకునే అవకాశం లేక అన్నదాతలు విసుగెత్తిపోతున్నారు. దీంతో చేసేదేమిలేక బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన రహదారినే కళ్లాలుగా మార్చుకొని ధాన్యం ఆరబోసుకు న్నారు. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టుగా మళ్లీ ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతోపాటు తుఫాన్ హెచ్చరికలతో ఏ క్షణంలో ఎలాంటి పరిస్థితులు చోటు చేసేకుంటాయోనని బెంబేలెత్తిపోతున్నారు.

-వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి)



## దిక్కుమొక్కూ లేని డంపింగ్ యార్డులు

పల్లెలు పరిశుభ్రంగా ఉండాలి. పంచాయతీలు ఆదాయం వైపు అడుగులు వేయాలి.. అనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలు వైసీపీ పాలనలో శిథిలావస్థకు చేరాయి. గ్రామాల నుంచి వచ్చిన చెత్తను వేరు చేసి, వాటి ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసి సంపద వైపు అడుగులు వేయాల్సిన గ్రామ పంచాయతీలు తమ లక్ష్యాన్ని మరిచిపోయాయి. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే డంపింగ్ యార్డులను వాడుకలోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంకా అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. దీంతో



గ్రామాల్లోని యార్డ్‌లు మందు బాబులకు నిలయమయ్యాయి. చిల్లచెట్లు మొలిచి అడవిని మరిపిస్తున్నాయి. ఓ వైపు ప్రభుత్వం చెత్త సేకరణతో పాటు డంపింగ్ యార్డ్ నిర్వహణ చేయాలని చెబుతున్నా .. మరోవైపు అధికారులు వాటిని గాలికి వదిలేయడం గమనార్హం.

- సీతారామపురం, (ఆంధ్రజ్యోతి)



## ఢిల్లీలో రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీరు ఎంపిక



రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్ తేజస్విని అభినందిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపునకు విక్రమ సింహపురి యూనివర్శిటీ కళాశాలలో ఫుడ్ టెక్నాలజీ విభాగంలో ఎంఎస్సీ చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎల్ తేజస్విని ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు మంగళవారం తేజస్వినిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి పది మంది వలంటీర్లు ఎంపికైతే వారిలో ఒకరు వీఎస్‌యూ నుంచి ఎంపిక కావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్టు : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్ తదితరులు

ఆత్మకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని, దాన్ని సేవిస్తున్న మరో నలుగురిని అరెస్టు చేశామని డీఎస్పీ కే వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా ను అరికట్టాలనే లక్ష్యంతో ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసి నిఘా ఉంచారన్నారు. ఈ క్రమంలో సోమవారం ఆత్మకూరు పంటవీధి పొలాల్లో ఉన్న పాడుబడినస్కూల్ ఆవరణలో యువకులు గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందిందన్నారు. సీఐ గంగాధర్ పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠా గుట్టు రట్టయిందని వివరించారు. ఆత్మకూరుకు చెందిన ఉదయగిరి వెంకటేష్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిసిందన్నారు. అతను తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరులో గంజాయి విక్రయిస్తున్న షేక్ మీరావలి, దొడ్డోజు పరబ్రహ్మచారి, సప్లయ్‌దారులు ఉదయగిరి వెంకటేశ్వర్లు, షేక్ ముస్తాఫా, బల్లి బాలాజీలతోపాటు వినియోగదారులు ఉప్పు విజయ్, పెండం వెంకట్, భవాని, గోవింద్‌లను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 3.5 కేజీల గంజాయిని, రెండు మోటారు సైకిళ్లను, డిజిటల్ కాటాను, రెండు గంజాయి తాగే శిలుములను స్వాధీనపరుచుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన సీఐ గంగాధర్‌ను, ఎస్‌ఐలు షేక్ జిలాని, ఎస్ సాయిప్రసాద్, కే శ్రీనివాసులరెడ్డి, క్రైమ్ సిబ్బందిని, స్టేషన్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## రూ.37 కోట్లతో ఆర్‌వోబీ నిర్మాణం

● రైల్వే రైట్స్ జేజీఎం కవిత



రైల్వేగేటు వద్ద పరిశీలిస్తున్న ఆర్డీవో, రైల్వే జేజీఎం

మనుబోలు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి రైల్వేగేటు వద్ద జిల్లా కలెక్టర్ అనుమతి రాగానే రూ.37 కోట్లతో ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణం చేపట్టనున్నట్లు రైల్వే రైట్స్ జేజీఎం (జాయింట్ జనరల్ మేనేజర్) ఎం.కవిత తెలిపారు. మంగళవారం స్థానిక చెర్లోపల్లి రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీ నిర్మాణం కోసం నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష అనూషతో కలిసి స్థల పరిశీలన చేశారు. నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను, నిర్మాణంలో పోతున్న భూముల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జేజీఎం మాట్లాడుతూ ఏడాదిలోనే ఆర్‌వోబీ పూర్తి చేస్తామన్నారు. వంతెన ప్రారంభం తరువాత గేటు మూసివేస్తామని చెప్పారు. వంతెన పక్కన సర్వీసు రోడ్డు ఉంటుందన్నారు. వంతెనపైన రెండు పక్కల ఫుట్‌పాత్ వేస్తారన్నారు. చెర్లోపల్లి, మనుబోలు మధ్య రాకపోకలకు అడ్డంకి లేకుండా సులువుగా ఆర్‌వోబీ ఉపయోగపడుతుందన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ సుమారు 700 మీటర్ల పొడవున ఆర్‌వోబీ నిర్మాణం జరుగుతుందన్నారు. దీంతో 7 ఎకరాల 41 సెంట్ల భూమిని రైతులు కోల్పోతారన్నారు. సదరు రైతులకు తగిన నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. స్థల పరిశీలన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఇప్పటికే పబ్లిక్ నోటీసు ఇచ్చామని తెలిపారు. నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య, వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యో పాపం... విశ్రాంత ఉద్యోగి

● మందులు తీసుకుంటూ షాపు ముందే మృత్యువాత

అనంతసాగరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆయన విద్యాశాఖ విశ్రాంత ఉద్యోగి... ఆరోగ్యం సరిగాలేక మందుల కోసం ఆత్మకూరుకి వెళ్లాడు.. మందులు తీసుకొంటూ షాపు మందే కుప్పకూలి చనిపోయాడు. ఈవిషాదగాథ ఆత్మకూరు లో మంగళవారం చోటుచేసుకొంది.. వివరాల మేరకు అనంతసాగరం గ్రామానికి చెందిన మట్టి రసూల్ (70) అనా రోగ్యంతో బాధపడుతున్నాడు. నెలవారీ మందుల కోసం ఆత్మకూరులోని బీఎస్ఆర్ సెంటర్ వద్ద మెడికల్ షాపు వద్దకు వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడి వారు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించి నాడి చూసి మృతి చెందినట్లు గుర్తించారు. ఈఘటనతో అక్కడి వారు నివ్వెరపోయారు. అనంతరం రసూల్ ఫోన్‌లో ఉన్న నెంబర్లకు సమాచారం ఇచ్చి, విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేశారు.



రసూల్ మృతదేహం

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 112 |
| లేయర్ లైవ్ | 105 |
| స్కిన్ చికెన్ | 210 |
| స్కిన్‌లెస్ | 230 |
| లేయర్ | 178 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.7325 |
| వెండి కిలో ధర | రూ. 91,000 |
| వెండి ఒక గ్రాము | రూ.94.00 |

## నుడా అభివృద్ధికి ప్రభుత్వ భూములు కేటాయిస్తాం

● అట్టహాసంగా నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి ప్రమాణ స్వీకారం

● టిడ్కో కాలనీల్లో ఆలయాల నిర్మాణం

● నగరానికి చెత్తతో కరెంటు ఉత్పత్తి చేసే ప్రాజెక్టు మంజూరు

● రాష్ట్ర మంత్రులు నారాయణ, ఆనం వెల్లడి



ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



గజమాలతో కోటంరెడ్డికి సత్కారం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ భూములను కేటాయించి లేఅవుట్ల ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తామని రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకుల సమక్షంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నుడా చైర్మన్‌గా మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నుడా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ముందుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీలకు ఇవ్వాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3200 కోట్లు గత వైసీపీ ప్రభుత్వం ఖర్చు పెట్టేసిందన్నారు. దీంతో మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీలకు నిధులు లేకుండా ఖజానాలు ఖాళీ అయ్యాయన్నారు. నుడా ఆర్థికంగా అభివృద్ధి చెంది, వనరులు సమకూర్చుకునేం దుకు పెద్దఎత్తున ప్రభుత్వ భూములను కేటాయించి, లేఅవుట్ల ఏర్పాటు చేసుకోవడం ద్వారా భారీగా నిధులు సమకూర్చుకోవచ్చని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో జనాభాశాతం పెరుగుతున్నందున కేంద్ర ప్రభుత్వం సహా ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు ఇస్తోందని చెప్పారు. నగరంలోని భూగర్భడ్రైనేజీ, మంచినీటి పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, తాము దానిపై దృష్టిపెట్టామని, ఏడాదిన్నరలో ఆ పథకాలను పూర్తిచేస్తామన్నారు. అలాగే టిడ్కో కాలనీల్లో దేవాలయాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. నగరం లో చెత్తతో కరెంటు ఉత్పత్తిచేసే ప్రాజెక్టు మంజూరయ్యిందని, నగరంతోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్తసమస్య పూర్తిగా తొలుగుతుందన్నారు. అల్లీపురం, దొంతాలి డంపింగ్ యార్డులలో ఉన్న చెత్తను జూలై నెలాఖరుకల్లా తొలగిం చేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నెక్లెస్ రోడ్డు, పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ టిడ్కో కాలనీల్లో దేవాలయాల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. నుడా అభివృద్ధికి అందరం సహకరిస్తామని, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి పని చేయాలన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూఖ్ మాట్లాడుతూ నుడా అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని అన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పచ్చ దనంపై నుడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నగర రోడ్లతో పాటు నెల్లూరు నుంచి విజయవాడ వరకు హైవేలో ఎక్కడా చెట్లు లేవన్నారు. వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నగరంలో అవుట్ రింగ్‌రోడ్డు ఏర్పాటుకు మంత్రి కృషి చేయాలని కోరారు. లేఅవుట్లలో రిజర్వ్‌డ్ స్థలాలు ఆక్ర మణకు గురికాకుండా స్వాధీనం చేసుకోవా లన్నారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడే వారికి ఉన్నత స్థానాలు ఉంటా యనేందుకు కోటంరెడ్డి పదవే నిదర్శనమ న్నారు. పార్టీ కోసం కష్టపడిన కనీసం వందమంది కార్యకర్తలకు కోటంరెడ్డి సాయం చేయాలని కోరారు.





మాట్లాడుతున్న మంత్రులు నారాయణ, ఆనం





ఇన్‌చార్జి మంత్రి ఫరూఖ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి

### బాలకృష్ణ అభినందనలు

నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డికి హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ అభినందనలు తెలిపారు. సభ జరుగుతున్న సమయంలో కోటంరెడ్డికి బాలకృష్ణ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపి, నుడాను అన్నివిధాలా ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం వేదికపై ఉన్న మంత్రులతోనూ బాలకృష్ణ మాట్లాడారు. ఈ సభలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నాయకులు గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్, నూనె మల్లిఖార్జున, టీడీపీ, బీజేపీ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ● నమ్మకాన్ని వమ్ము చేయను : కోటంరెడ్డి

తనపై ఎంతో నమ్మకంతో రెండో దఫా నుడాచైర్మన్ పదవిని ఇచ్చిన నేతల నమ్మకాన్ని వమ్ముచేయకుండా, ప్రజల మన్ననలు పొందేలా పాలన సాగిస్తానని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి తెలిపారు. నగరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. జిల్లాకు సేవలు అందించి మృతిచెందిన పాలకులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ఆనం వివేకానంద రెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, ఉక్కాల రాజేశ్వరమ్మ, మాగుంట పార్వతమ్మ, వెన్నెలకంటి రాఘవయ్య విగ్రహాలను నగరంలో ఏర్పాటు చేసేలా మంత్రి నారాయణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

### ● భారీ బైక్ ర్యాలీ

కోటంరెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నర్తకి సెంటర్ లో ఉన ఎన్టీఆర్ విగ్రహం నుంచి వేలాది సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి, గాంధీబొమ్మ, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు, ఏసీ స్టేడి యం, వేదాయపాళెం, అయ్య ప్పగుడి మీదుగా ఆటో నగర్‌లోని నుడా కార్యాలయం వరకు ర్యాలీ సాగింది.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

● పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర పరిశీలకుడు రమేష్



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర పరిశీలకుడు రమేష్

ఆత్మకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు శిక్షణలో తెలుసుకున్న అంశాలను, క్షేత్రస్థాయిలో అమలు పరిచి తొమ్మిది సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర పరిశీలకుడు ఏ రమేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం రెండోరోజు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, అందరికీ ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, సుస్థిరమైన నగర రూపకల్పన, సామాజిక న్యాయం, లింగ సమానత్వం తదితర మౌలిక సదుపాయాలను అందరికీ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను రూపొందించిందని తెలిపారు. డీఎల్‌పీవో డీ నారాయణ, ఎంపీడీవో పీ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలైన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య శిక్షకులు, ఈవోపీఆర్డీ డేవిడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీ కేశవనారాయణమ్మ, ఏవో కే శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన ఇంజనీరింగ్ సిబ్బంది

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : మంచి సిమెంటు రోడ్ల నిర్మాణం, రోడ్లు, వంతెనల రూపకల్పన విషయాల్లో సాఫ్ట్‌వేర్ ఉపయోగాలపై జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధిశాఖ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా సిమెంటు రోడ్లు, వివిధ ప్రాజెక్టుల ద్వారా నిర్మించే రోడ్ల నిర్మాణాల్లో తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అడ్వైజర్లు కే ప్రభాకరరెడ్డి, నరసిం హారావు శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఈఈ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్లు పాల్గొన్నారు.

## 21 నుంచి హెడ్‌మాస్టర్ టెస్ట్

నెల్లూరు(విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పలు కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 21, 22 తేదీల్లో హెడ్‌మాస్టర్ టెస్ట్ జరుగుతుందని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలు విజయ వాడ గాంధీజీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి 1 గంట వరకు జరుగుతా యని తెలిపారు. హాజరయ్యే ఉపాధ్యాయులు హాల్‌టికెట్లను www.bseap.org వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

## డిగ్రీ పరీక్షలకు 390 మంది గైర్హాజరు

వెంకటాచలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 390 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 4,820 మంది విద్యార్థులకు గాను 4,430 మంది హాజరయ్యారని తెలిపారు.

## హత్యాయత్నంపై కేసు నమోదు

కొండాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టరుతో ఢీకొట్టి హత్యాహత్నం చేశాడంటూ బాధితుడు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాయిపేట పంచాయతీ ఎర్రబాలెం కొమ్మి ప్రభాకర్ వ్యవసాయ బోర్ల వద్ద అదే గ్రామానికి చెందిన బోనముక్కల మాల్యాద్రిరెడ్డి గతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఇది సరికాదని చెప్పినందుకు గొడవకు దిగారు. దీంతో కక్ష్యకట్టిన బోనముక్కల మాల్యాద్రిరెడ్డి ఉద్దేశపూర్వకంగా కారులో వెళ్తున్న ప్రభాకర్‌ను తన ట్రాక్టరుతో ఢీకొట్టి హత్యాహత్నం చేసేందుకు ప్రయత్నించాడు. ఈ మేరకు మాల్యాద్రిరెడ్డిని అదుపులోకి తీసుకోని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అందని 'ల్యాబ్' సేవలు

- అర్బన్ హెల్త్‌సెంటర్‌లో లేని టెక్నీషియన్
- వ్యాధి నిర్ధారణకు ప్రజల ఇబ్బందులు
- ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయిస్తున్న రోగులు




కోవూరు రోడ్డులో ఏడాదిక్రితం ప్రారంభమైన అర్బన్ హెల్త్‌సెంటర్

కందుకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవూరురోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్‌సెంటర్‌లో తగినంత వైద్య సిబ్బంది, వ్యాధి నిర్ధారణకు కీలకమైన ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందటం లేదు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పట్టణంలోని క్లబ్ సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ల్యాబ్ టెక్నీషియనే ఇక్కడ కూడా డిప్యుటేషన్‌పై వారంలో రెండురోజులు విధులు నిర్వహిస్తున్నారు. ఏ చిన్న వ్యాధి నిర్ధారణకు వెళ్లి పరీక్షలు చేయించుకుని రమ్మని సూచిస్తుండటంతో కోవూరు రోడ్డు అర్బన్ హెల్త్‌సెంటర్ పరిసరాల్లో ఎస్టీ కాలనీలు, జనార్దన కాలనీ, ఏకలవ్య నగర్, ఉప్పు చెరువు, బొగ్గులసంఘం తదితర నిరుపేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని హంగులతో నూతన భవనం నిర్మించి అన్నిరకాల పరికరాలు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోతున్నదని స్థానికులు వాపోతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవటం, సిబ్బంది కొరత కారణంగా మిగిలిన సిబ్బంది, డాక్టరు కూడా పూర్తిస్థాయిలో తమ సేవలు వినియోగించటం లేదన్న విమర్శలూ ఉన్నాయి.

## గుంతలు పూడ్చివేత



కోఆపరేటివ్ కాలనీలోని గుంతకు వేసిన సిమెంట్ కాంక్రీట్

కావలి, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో దెబ్బతిన్న రోడ్లకు అధికారులు మంగళవారం ప్యాచ్‌వర్క్ పనులను చేపట్టారు. 40వార్డులోని గుంతలను పూడ్చివేశారు. అలాగే పట్టణంలోని మరికొన్ని వార్డులలో పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. నెలాఖరులోగా పనులు పూర్తిచేస్తామన్నారు.

## పెన్షనర్ల సామాజిక దృక్పథం అభినందనీయం

- పెన్షనర్ల దినోత్సవంలో డీఎస్పీ శ్రీధర్



సన్మానం అందుకున్న సీనియర్ పెన్షనర్లు

కావలి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు సామాజిక దృక్పథం కలిగి ఉండటం అభినందనీయం అని డీఎస్పీ శ్రీధర్ అన్నారు. ఆలిండియా పెన్షనర్ల దినోత్సవంను పురస్కరించికొని కావలి తాలూకా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా డీఎస్పీ శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలైన పెన్షనర్లకు బహుమతులు అందజేశారు. సీనియర్ పెన్షనర్లను శాలువా,పూలమాలు మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య, సహాధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి ఆదిశేషులు, వెంకయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### పేదలకు పండ్లు పంపిణీ

ఉలవపాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటిరెడ్డికుంట ఎస్టీ కాలనీవాసులకు మంగళవారం హైకోర్టు జూనియర్ న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, మన్నం శ్రీహరిబాబు పండ్లు పంపిణీ చేశారు. శానంపూడి ఉన్నం కార్తీక్ పుట్టినరోజు సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో తొట్టింపూడి సుబ్బారాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### కుట్రలను తిప్పికొట్టాలి

ఉదయగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై కొంతమంది మాలలు చేస్తున్న కుట్రను మాదిగలు తిప్పికొట్టాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. మంగళవారం ఏబీఎం చర్చి ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జిల్లాలో జరగనున్న మంద కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాషువా, బెజవాడ బాలగురవయ్య, పండిటి అంబేడ్కర్, డేవిడ్, మోహన్, సింహాద్రి పాల్గొన్నారు.

### కూలీల సంఖ్య పెంచాలి

ఉదయగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులకు వచ్చే రోజువారి కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పట్టణ సమీపంలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. మస్టర్లలో హాజరును తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. క్షేత్ర సహాయకులు కూలీలకు కొలతలు కేటాయించి పనులు చేయించాలన్నారు.

### 32 మందికి ఉద్యోగాలు

ఆత్మకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 69 మంది పాల్గొన్నారు. వీరికి పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులైన 32మందికి ఉద్యోగాలిచ్చారు. వారిని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూమ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అభినందించారు.

### ధనుర్మాస పూజలు

వింజమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమలనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, హారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా మేకల వెంకటరమణయ్య-ప్రసన్న దంపతులు, వారి కుమారులు వెంకటహేమంత్ యాదవ్, వెంకట నిఖిల్, ఆర్య వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ కౌన్సిలర్‌గా చెంచలబాబు

వింజమూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ నాయకుడు గాలం చెంచలబాబు యాదవ్‌ను యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నుకున్నట్లు మండల నాయకులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆయన్ను మూడోసారి ఎన్నుకోవడం పట్ల యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, వీరాంజనేయులు, పరమేశ్వరరావు, శివకుమార్, సుబ్బారావు, నరసింహులు, మీరావలి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

కందుకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, సాంకేతిక అధికారి సుకుమార్‌లు స్థానిక ఏఓ రాముతో కలిసి మంగళవారం పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల యాజమానులకు పాటించాల్సిన సూచనలు తెలిపారు.

### ఆంజనేయరెడ్డిని కలిసిన అమరా

కావలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జీఎస్‌టీ సభ్యులు అమరా వెంకటసుబ్బారావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందంతో కలిసి మంగళవారం నెల్లూరులో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డిని కలిశారు. కావలిలో బీజేపీ బలోపేతానికి చేట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వ్యాపారులకు కేంద్ర జీఎస్టీతో ఎదురయ్యే ఇబ్బందులను చర్చించారు.

### ఓరియంటేషన్‌పై శిక్షణ

సీతారామపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, మండల అధికారులకు ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన ఓరియంటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటా లకు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉంటాం

- పైడేరు ఎస్కేప్-2 చానల్ అధ్యక్షుడిగా బీద గిరిధర్, కావలి కాలువ డీసీ-2కి వంటేరు



నియామక పత్రాన్ని అందుకుంటున్న బీద గిరిధర్



నియామకపత్రం అందుకుంటున్న వంటేరు జయచంద్రారెడ్డి

అల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సాగునీటి సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తానని పైడేరు ఎస్కేప్-2 ఛానల్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడిగా బీద గిరిధర్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో డైరెక్టర్లు ఆయన్ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఎన్నికల అధికారులు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీద గిరిధర్ మాట్లాడుతూ రైతులు తమకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధ్యక్ష ఉపాధ్యక్షులు గిరిధర్‌కు, కృష్ణారెడ్డిలకు కార్యకర్తలు అభిమానులు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, బండి అమర్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తోట శ్రీహరి, కృష్ణచైతన్య, పావనబోయిన రత్తయ్య, అరగల రమణయ్య, సామంతుల పరంధామరెడ్డి పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల నోడల్ అధికారి నారాయణయ్య ఆధ్వర్యంలో కావలి కెనాల్ అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలో ఎన్నికైన ఎస్వీ పీఎం-1, 2 అధ్యక్షులు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, యన్నాబత్తిన రమణయ్య చామాదల బీ-1 పేరం వెంకటేశ్వర్లురెడ్డి, తలమంచి మేజర్ పులి శీనయ్యలు దామవరం మైనర్ అధ్యక్షుడు కండ్లగుంట మధుబాబునాయుడు, ఉపాధ్యక్షుడిగా పులి శీనయ్యను ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాగునీటి సం ఘాల ఎన్నికల అధికారి అశోక్‌కుమార్ మధుబాబునాయు డు కు, పులి శీనయ్యలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్ర మం లో టీడీపీ నేతలు ముంతాల వెంకయ్య, గనిపినేని నాగరాజు, గన్నేషం రమేష్‌రెడ్డి, పేరం కృష్ణారెడ్డి, శ్రీహరినాయుడు, పుచ్చకాయల రమేష్ ఉన్నారు.

**జలదంకిలో..**

జలదంకి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కావలి కాలువ-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలో సోమవరప్పాడు మేజర్ కాలువ అధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి కావలి కాలువ డీసీ-2 అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చామదల-2 మేజర్ కాలువ అధ్యక్షుడు మలినేని హరిబాబునాయుడు ఉన్నారు. ఎన్నికను ఎన్నికల అధికారి నుంచి వారు నియామకపత్రం అందుకున్నారు. ఎన్నికైన వీరిని నీటి సంఘం అధ్యక్షులు పూనూరు భాస్కర్‌రెడ్డి, వంటేరు భాస్కర్ రెడ్డి, హరిబాబు, టీడీపీ నేతలు మునగాల తిరుమలరెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, కరియావుల అప్పలయ్యనాయుడు, గుర్రం ప్రవీణ్‌బాబులు అభినందించారు.

## పంటల బీమా చేసుకోండి

- వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి, అల్లూరు



అల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు బీమా ప్రీమియం చేసి ఇన్సూరెన్స్ సౌకర్యం పొందాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎకరానికి రూ.168 చెల్లిస్తే పంట బీమా వర్తిస్తుందన్నారు.

**? వరి సాగులో ఏర్పడే ప్రధాన సమస్య.**

! ప్రారంభ దశలో అత్యధికంగా తెల్లతెగులు వస్తుంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో అగ్గితెగులు వ్యాపిస్తుంది. తెల్లతెగులు నివారణకు క్లోర్-50, అగ్గితెగులుకు ట్రైసైక్లోజోల్ పిచికారీ చేసుకోవాలి.

**? పీఎం కిసాన్ పథకంలో అనర్హులను గుర్తించారా.**

! మండలంలో జరిగిన సర్వే అనంతరం జరిగిన పరిశీలనలో 263మంది అనర్హులుగా గుర్తించాం. రెండోసారి విచారణ చేపట్టి అర్హులుంటే వారిని కొనసాగిస్తాం. అనర్హుల వివరాలు ఉన్నతాధికారులకు పంపుతాం.

**? యూరియా ఎందుకు డిమాండ్ ఏర్పడింది.**

! రబీ సీజనులో అల్లూరులోని రెండు సొసైటీల్లో యూరియాకు డిమాండ్ ఎక్కువగా ఉంది. మిగిలిన ప్రాంతాల్లో యూరియా అందుబాటులో ఉంది. మరో రెండురోజుల్లో ఈ రెండు సొసైటీలల్లో 60టన్నుల యూరియాను అందుబాటులో ఉంచాం.

**? దిగుబడి సమయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అవుతాయా.**

! గత పరిస్థితి గురించి నాకు తెలియదు. ఈ రబీ సీజను పూర్తి చేసుకునే నాటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఈ కేంద్రాలతో విక్రయించుకునే రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలి. కౌలు రైతులు కూడా తమ కౌలుపత్రాల ద్వారా ఈ-పంట నమోదు చేసుకుంటే దిగుబడి అమ్ముకునేందుకు అర్హత పొందగలరు.

## మందాటి చెరువును సంరక్షించండి



కలిగిరి: అర్జీ అందజేస్తున్న రైతులు

కావలి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముసునూరు 14వ వార్డు సచివాలయంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా మందాటి చెరువు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు చెరువు పరిరక్షణ సమితి భాద్యులు ఇంటూరి రమణయ్య, బీజేపీ పట్టణ కార్యదర్శి మందా కిరణ్, జనసేన నాయకులు శ్రీనాథ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. హిందూ శ్మశాన వాటిక స్థలం ఆక్రమణలు తొలగించాలని కోరారు. ప్రధానంగా ముసునూరులో ఎక్కువగా చుక్కల భూముల సమస్యలు, రాళ్లగుట్ట పోరంబోకు స్థలాలు, క్వారీ పోరంబోకు స్థలాలపై వినతులు అందజేశారు.

- కందుకూరు: వలేటివారిపాలెం మండలం సింగమనేనిపల్లిలో దేవాయికుంట ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త చిడిపోతు వెంకటేశ్వర్లు మంగళవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో జరిగిన సదస్సులో ఆయన పూర్తి ఆధారాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.
- ఉదయగిరి: కుర్రపల్లిలో తహసీల్దారు సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజలు, రైతులు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డీటీ హసీనా, వీఆర్వో అనూష, సర్వేయర్లు రమణ, శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- దుత్తలూరులో:అయినపల్లిలో తహసీల్దారు వై.నాగరాజు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకట్, సర్వేయరు శివ, సిబ్బంది పాల్గొన్నారు.
- కలిగిరి: రెవెన్యూ సదస్సులు చప్పగా సాగుతున్నాయి. అధికారుల నుండి పూర్తి స్థాయిలో సమాచారం లేకపోవడంతో సదస్సులకు రైతులు హాజరుకావడం లేదు. ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న భూ సమస్యలపై పరిష్కారం లభించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలిగిరి పంచాయతీ పరిధిలో వివిధ భూ సమస్యలపె జరిగిన సదస్సులో 50అర్జీలు మాత్రమే అందినట్లు అధికారులు తెలిపారు. జిర్రావారిపాలెంలో భూములు తప్పుగా నమోదై ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 1నుండి 500వరకు రీసర్వే చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపతున్నారు.
- వలేటివారిపాలెం: శింగమనేనిపల్లె పంచాయతీ కార్యాలయంలో అధికారులు గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్‌అమీద్ పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కుటుంబసభ్యులకు డిపాజిట్ పత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కందుకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అకాలంగా మరణించిన స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వజూనియర్ కళాశాల కాంట్రాక్టు ఇంగ్లీష్ అధ్యాపకుడు చాత్రాసి భాస్కరరావు కుటుంబానికి మంగళవారం అధ్యాపకులు రూ.3,36,600లను అందజేశారు. కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో మృతుడి భార్య, కుమార్తె పేరుతో ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ అందరి సహకారంతో మొత్తాన్ని సమకూర్చినట్లు తెలిపారు. కృషి చేసిన అధ్యాపకులు బాబూరావు, హజరత్తయ్య, కాశీరత్నంలను ప్రిన్సిపాల్ అభినందించారు.

## సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

ఉదయగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. మంగళవారం స్త్రీశక్తి భవనంలో పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ నిర్వహించారు. జడ్పీటీసీ రామాంజనేయులు, మండల వైస్ మట్ల శాంతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివా సరాజు, ఈవోపీఆర్డీ కరీముల్లా, ఏపీఎం ఖాజా రంతుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను పాల్గొన్నారు.

- చేజర్ల: ప్రజాప్రతినిధులతో అధికారులు భాగస్వామ్యమై సమన్వయంతో పనిచేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని ఏపీ ఎస్ఐఆర్డీ పీఆర్ రాష్ట్ర పరిశీలకులు రమేష్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై ఎంపీ డీవో విజయలలిత సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నారాయ ణ, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ శివ పాల్గొన్నారు.

### నిందితులపై చర్య తీసుకోండి

కావలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాను ఇంటిలో లేని సమయంలో తన ఇంటికి కావలి మంచాల ప్రసాద్ తన అనుచరులతో వచ్చి తన తల్లిదండ్రులు రసూల్ సాహెబ్, బీబీ జానీపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు జలదంకి ఖాజారహంతుల్లా తెలిపారు. ఈ విషయంపై మంగళవారం స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తాను మంచాల ప్రసాద్ దగ్గర కొంత డబ్బులు వడ్డీకి తీసుకున్న విషయంపై వివాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రసాద్ తన అనుచరులతో జలదంకిలోని తమ ఇంటికి వచ్చి దాడులు చేసి ఇంటికి తాళం వేసి వెళ్లాడన్నారు. ఈ విషయంపై స్టేషన్‌లో ఫిర్యాదు చేసామని తమకు న్యాయం చేసి కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

### 'అంత్యోదయ' మంజూరు చేయాలి

అనంతసాగరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దినసరి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న పేదలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేము హరిబాబు తెలిపారు. మహిళలతో కలిసి మంగళవారం టీడీ సుబాషిణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు.

### బడికి పంపించండమ్మా..!

అనంతసాగరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులను క్రమంతప్పకుండా బడికి పంపించండమ్మా.. అంటూ కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం మంగుపల్లి, కామిరెడ్డిపాడులో ప్రచారం చేసి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వసుందరాదేవి, ఉపాధ్యాయులు మనోజ్‌కుమార్, వెంకరమణరాజు పాల్గొన్నారు.

### డీఎస్పీ తనిఖీ

అనంతసాగరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సీఐ గంగాధర్, ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన పుచ్చలపల్లి

సంగం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోలగట్ల పుచ్చలపల్లి వరదారెడ్డి మంగళవారం మంత్రి ఆనం రామనారాణరెడ్డిని నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలపై చర్చించారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

సంగం, డిసెంబరు 17: పెరమన, జంగాలదొరువు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో సునీలత, సూపర్‌వైజర్ పద్మావతి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

### పోక్సో చట్టంపై అవగాహన

చేజర్ల, డిసంబరు17 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం పోక్సోచట్టంపై పోలీసులు అవగాహన నిర్వహించారు. సీఐ వేమారెడ్డి ఎస్ఐ తిరుమలరావు, హెచ్ఎం హైమావతి పాల్గొన్నారు.

### మంత్రి ఆనంకు సత్కారం



మంత్రి ఆనంకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న నేతలు

ఆత్మకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డిని మంగళవారం ఆత్మకూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మా దాల మస్తాన్‌నాయుడు, సభ్యులు, టీడీపీ నేతలు పూలమాలలతో సత్కరిం చారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, నేతలు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, గుండాల బుజ్జిరెడ్డి, కొప్పోలు చిన్నపురెడ్డి, వల్లూరు వెంకటరమణారెడ్డి కౌన్సిలరు మాదాల శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

## మోటార్లతో కుడి కాలువకు నీరివ్వాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుల డిమాండ్



లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించిన ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు

లింగసముద్రం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గేటు మరమ్మతు చేసేవరకు రైతాంగానికి మోటర్లతో నీరు లిఫ్ట్ చేసి కుడి కాలువకు నీరు అందించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండురోజులుగా నీటికోసం రోడ్డెక్కిన రైత న్నలకు అండగా రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఏపీ రైతు సంఘం నాయకులు విరిగిపోయిన రాళ్లపాడు ప్రాజెక్టు కాలువ గేట్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రతిఏడాది నీటి ఎద్దడితో పంటలు పండక నానా ఇబ్బందులు పడ్డామని, ఈ ఏడాది నీరు పుష్కలంగా ఉండి అధికారుల నిర్వాహణ లోపంతో నీరు అందడం లేదని రైతులు వాపోయారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి వరి నారుమళ్లు వేసుకుంటే ఆచరణలోకి వచ్చే సరికి ఈ పరిస్థితి నెలకొందని చెప్పారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పాలక, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మాని రైతులకు నీరు ఇచ్చేలా లేరని మండిపడ్డారు. ప్రస్తుతం వస్తున్న 100క్యూసెక్కుల నీరు ఎంతమాత్రం సరిపోదని గేట్లు ఎత్తడం కోసం నిపుణులను రప్పించి సమస్య పరిష్కారం చేయాలని అంతవరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు జీవీబీ కుమార్, ఎస్‌డీ గౌస్‌బాషా, మ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుప్పూరి జాను, డీఎం రాయుడు పాల్గొన్నారు.

- కందుకూరు: రాళ్లపాడు రిజర్వాయరు కుడి కాలువ షట్టర్ విరిగి పడిపోయి పదిరోజులు గడిచినా ఆ సమస్యను పరిష్కరించి కాలువకు నీరు విడుదల చేయకలేక పోవటంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణం అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రైతులు సాగు చేసిన వరినారు మడులు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. విరిగిన షట్టర్‌ను లేపటం కష్టసాధ్యంగా ఉందని, ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుందని అర్థమైనపుడు మోటార్లు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలతో నీరందించే ఏర్పాట్లు చేయకపోవటం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు.

### విజేతలకు అభినందన

కావలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా కదిరి మండలం ఓడిచెరువులో ఈ నెల 15న జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోలింగ్ పోటీలు జరిగాయి. ఇందులో ఎస్ఆర్ విద్యానికేతన్ విద్యార్థులు అర్జున్, జాయ్, వనజితేంద్రలు ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని అభినం దించారు. జనవరిలో జైపూరులో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల చైర్మన్ శ్రీవల్లి, ప్రిన్సిపాల్ అన్నమ్మ, పీడీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

### సోమశిల దక్షిణ కాలువ చైర్మన్‌గా కేశవచౌదరి

చేజర్ల, డిసంబరు17 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్టు దక్షిణ కాలువ కమిటీ చైర్మన్‌గా నాగులవెల్లటూరు టీడీపీ సీనియర్ నాయకుడు వేలూరు కేశవచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రత్యేక అధికారి, ఆర్‌బీ ఎస్ఈ గంగాధర్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్‌గా కేశవచౌదరి, వైస్ చైర్మన్‌గా కలువాయి చల్లా విజయభాస్కర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

- అనంతసాగరం: ఎంపీడీవో కార్యాలయంలో సోమశిల ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీ ధనుంజయను అధికారులు ఎంపిక చేశారు. ఈమేరకు వారికి డిక్లరేషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రమణారెడ్డి, నోడల్ ఆఫీసర్ పెద్దిరాజు, ఈవో శోభన్‌బాబు మండల టీడీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీత, సాగరం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మట్టి తరలిస్తే చర్యలు

సీతారామపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో అనుమతి లేకుండా, హైవే నిర్మాణ సంస్థలు మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. మారంరెడ్డిపల్లిలో ప్రభుత్వ అనాధీన భూమిలో హైవే నిర్మాణ సంస్థ మట్టి తరలించినట్లు గ్రామానికి చెందిన ఎలిషా కుమార్, ప్రతాపరెడ్డిల ఆధ్వర్యంలో గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్‌కి అర్జీని అందజేశారు.

## న్యూస్ బాక్స్

### ఆహార పదార్థాల్లో కలర్స్ వాడితే క్రిమినల్ కేసులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హానికరమైన ఫుడ్ కలర్స్‌ను ఆహార పదార్థాల్లో వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆహార భద్రత అధికారిణి డాక్టర్ నీరజ పేర్కొన్నారు. మంగళవారం బుచ్చి నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో హోటళ్ల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, హోటల్స్ యజమానులు పాల్గొన్నారు.

### సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

వెంకటాచలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నేత గోగుల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన కమిటీ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, దేవదానం, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

### 'ఎస్ఈఐఎల్'కి 'బెస్ట్ సోషల్ వెల్ఫేర్ ఇనిషియేటివ్' అవార్డు

తోటపల్లిగూడూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు ప్రతిష్ఠాత్మక యూబీఎస్ ఫోరం బెస్ట్ సోషల్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ ఆఫ్ ది ఇయర్ 12వ ఎడిషన్ కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమ్మిట్-2024 అవార్డు దక్కింది. ఈ అవార్డును మంగళవారం సీఎస్ఆర్ హెడ్ ఆల్బర్ట్ డేవిడ్ పీటర్ చేతుల మీదుగా అందుకున్నట్లు ఎస్ఈఐఎల్ కంపెనీ సీఈవో రాఘవ త్రివేది తెలిపారు. అవార్డు గెలుచుకున్నందుకు సీఎస్ఆర్ బృందాన్ని అభినందించారు.

### కోవూరులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోవూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్బీఎస్‌లో బుధవారం మరమ్మతులు చేస్తున్నందు వల్ల ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ కే.మధుసూదనరెడ్డి తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు.

### వేగూరులో 'పొలం పిలుస్తోంది'

కోవూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ జేడీ పీ.సత్యవాణి మాట్లాడుతూ ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు ప్రాంత రైతులు జింక్ లోపాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పొలాల్లో మురుగు నీటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు సుభాషిణి, కోటీశ్వరి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

● వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిచెర్లపాడు, పాలిచెర్లపాడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి పంట సాగులో మెలకువలు, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరి కరుణాకర్‌రెడ్డి, ఉద్యానవన అధికారిని వై ప్రేమలత, వ్యవసాయ సహాయకురాలు జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.





గాలలో కీలకమైన నిర్ణయాలు తీసుకోలేమని చెప్పారు. కాగా, వాతావరణ శాఖ భారీ వర్ష సూచనల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూర్యతేజ ఓ ప్రకటనలో కోరారు. మున్సిపల్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, ప్రజలు కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కోర్టు కేసులు పెండింగ్ ఉంచొద్దు : మేయర్


అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థకు సంబంధించి కోర్టుల్లో పెండింగ్ ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మేయర్ స్రవంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె చాంబరులో స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్ష జరిపారు. న్యాయస్థానాల్లో ప్రస్తుతం నడుస్తున్న కేసుల స్థితిపై ఆరా తీశారు. కోర్టుల్లో కేసులు పెండింగ్ ఉండటం వల్ల వివిధ విభా

# పోర్టు వాహనాల అడ్డదారులు!

● సర్వేపల్లి మీదుగా రాకపోకలు ● పెరుగుతున్న ప్రమాదాలు ● టోల్ ఫీజు తప్పించుకునేందుకే..


సర్వేపల్లి రోడ్డులో వెళ్తున్న లారీలు

వెంకటాచలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం పోర్టుకు రాకపోకలు సాగించే వాహనాలు సర్వేపల్లి మీదుగా పోర్టుకు వెళుతున్నాయి. టోల్ ఫీజు తప్పించుకునేందుకు ఈ మార్గంలో వెళుతుండడంతో వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు పెరుగుతోన్నాయి. వివరాల మేరకు.. కృష్ణపట్నం పోర్టుకు వెళ్లడానికి పోర్టు నిర్వాహకులు రామదాసుకండ్రిగ గ్రామం వద్ద నుంచి చెన్నై, కోల్‌కత్తా జాతీయ రహదారి నుంచి ప్రత్యేకంగా రహదారిని నిర్మించిన విషయం తెలిసిందే. పోరుకు వెళ్లాల్సిన వాహనాలు ఆ మార్గంలో వెళ్లాల్సి ఉంది. అయితే నెల్లూరు వైపు నుంచి పోర్టుకు వెళ్లే వాహనాలు వెంకటాచలం టోల్‌ప్లాజా గుండా వెళ్లాల్సి రావడంతో ఇక్కడ టోల్ రుసుము చెల్లించాలి. దీని నుంచి తప్పించుకునేందుకు నెల్లూరు వైపు నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలు దాదాపుగా వెంకటాచలం నుంచి సర్వేపల్లి గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో సర్వేపల్లి రోడ్డు వెంట ప్రమాదాల సంఖ్య పెరగడంతో పాటు ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ముఖ్యంగా వెంకటాచలం రైల్వే క్రాసింగ్ వద్ద నిత్యం ట్రాఫిక్ స్తంభించి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా సర్వేపల్లి గ్రామం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఇడిమేపల్లి రోడ్డు గుండా పోర్టు రోడ్డులోకి వెళ్లే వాహనాలు ఇక్కడ ఉన్న మలుపు గురించి తెలియక ప్రమాదాలకు గురవుతోన్నాయి. తరచూ ఇక్కడ వాహనాలు బోల్తాపడి పలువురు మృతి చెందగా, కొందరు గాయపడ్డారు. ఈ వాహనాలను ఈ మార్గంలో రాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

నెల్లూరు, వెంకటాచలం, కోవూరు, విడవలూరు ఎంపీడీవో కార్యాలయాల్లో మంగళవారం జరిగిన నెల్లూరు ట్యాంకు సప్లయ్ చానెల్, సర్వేపల్లి కాలువ, సదరన్ చానెల్, ఈస్టరన్ చానెల్-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి.

### ఎన్‌టీఎస్ కమిటీ చైర్మన్‌గా శివనారాయణ

నెల్లూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ట్యాంకు సప్లయ్ చానల్ (ఎన్‌టీఎస్) డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా పెనుబర్తి గ్రామానికి చెందిన ఏలూరు శివనారాయణనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారి ఎంవీ సుబ్బారెడ్డి నిర్వహించారు. కమిటీ


అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న గిరిధర్‌రెడ్డి

చైర్మన్‌గా శివనారాయణ నాయుడు, వైస్ చైర్మన్‌గా కనుపర్తిపాడు గ్రామానికి చెందిన చేవిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పోటీ దరఖాస్తులు రాకపోవడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరిద్దరిని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి అపర్ణ, నోడల్ అధికారి ఎన్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

### సదరన్ చానెల్ చైర్మన్‌గా రాజగోపాలరెడ్డి


జెట్టి రాజగోపాలరెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కోవూరు,(ఆంధ్రజ్యోతి): సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా లేగుంటపాడు సర్పంచు జెట్టి రాజగోపాలరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటరమణయ్య ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా రేబాల నీటిసంఘం అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ తదితరులు సన్మానించి అభినందించారు.

### సర్వేపల్లి కాలువ చైర్మన్‌గా చల్లా నాగార్జున్‌రెడ్డి

వెంకటాచలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఈదగాలి సాగునీటి సంఘం అధ్యక్షుడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల అధికారి, డీపీవో ఎల్ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో సర్వేపల్లి కాలువ కింద ఉన్న 12 సాగునీటి సంఘాల అధ్యక్షులకు గాను 10 మంది హాజరయ్యారు. వీరందరూ ఏకగ్రీవంగా చల్లా నాగార్జున్‌రెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అలాగే బ్రహ్మదేవం సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆలూరు వెంకట విష్ణువర్ధన్‌రావును వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈలు వేమారెడ్డి, పెంచలరావు, ఐసీడీఎస్ అధికారిణి అనురాధ, నాయకులు రాధాకృష్ణారెడ్డి, రాధాకృష్ణమనాయుడు, సాగునీటి సంఘాల అధ్యక్షులు కుంచి శ్రీనివాసులు యాదవ్, ఈపూరు సుబ్బారెడ్డి, జానా శ్రీనివాసులు, రవీంద్రరెడ్డి, రామ్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సురేష్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న చల్లా నాగార్జున్‌రెడ్డి

### ఈస్టరన్ చానెల్-2 చైర్మన్‌గా పాశం


పాశం శ్రీహరిరెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రత్యేకాధికారి

విడవలూరు,(ఆంధ్రజ్యోతి): ఈస్టరన్ చానెల్-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా విడవలూరుకు చెందిన పాశం శ్రీహరిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన నీటి సంఘం ఎన్నికల్లో కొడవలూరు, విడవలూరుకు చెందిన 10 మంది నీటి సంఘాల అధ్యక్షులు శ్రీహరిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్లపల్లికి చెందిన అడపాల జనార్దన్‌రెడ్డిని వైస్‌చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వారిని టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఎస్‌కె.రఫీ, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, పూండ్ల యేసేబు అభినందించారు.

# వెంకటేశ్వరపురంలో రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలి

● మంత్రి నారాయణకు స్థానికుల విన్నపం


మంత్రికి విన్నవించుకుంటున్న సాధన సమితి సభ్యులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో వెంకటేశ్వరపురం పరిధిలోని నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణను స్థానికులు కోరారు. టీడీపీ సీనియర్ నాయకుడు మండవ రామయ్య ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం రిజిస్ట్రేషన్ సాధన సమితి సభ్యులు మంగళవారం మంత్రిని కలసి సమస్యలు విన్నవించారు. 60 ఏళ్లగా వెంకటేశ్వరపురంలో నివసిస్తున్నామని, 40 ఏళ్ల క్రితమే అప్పటి కలెక్టర్ పట్టాలు ఇచ్చారని తెలిపారు. 2011 వరకు వెంకటేశ్వరపురంలోని స్థలాలకు రిజిస్ట్రేషన్ జరుగుతుండేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ తరువాత ఈ ప్రాంతాన్ని రెవెన్యూ శాఖ బ్లాక్ లిస్టులో పెట్టి రిజిస్ట్రేషన్లు నిలిపివేసిందన్నారు. పిల్లల చదువు, వివాహం, వైద్య ఖర్చులు వంటి వాటికి రుణాలు పొందేందుకు తమ ఇళ్లు అక్కరకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల శ్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ పూర్తి వివరాలు సేకరించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరసాపురం ప్రసాద్, అశోక్, సుధాకర్, ప్రసాద్, రమాదేవి, తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపుపై దాడులు

● 15 మద్యం సీసాల స్వాధీనం, ఒకరి అరెస్టు


పట్టుబడిన మద్యం సీసాలు

పొదలకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పొదలకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సైదాపురం మండలం దాడిశెట్టిపల్లిలో సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బెల్టుషాపు నిర్వాహకుడు పీ.సాయికృష్ణని అరెస్టు చేసి, అతని నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు స్టేషన్ పరిధిలో 25 అనధికకార మద్యం కేసులు నమోదు చేసి, 25 మందిని అరెస్టు చేసి వారి నుంచి 357 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడుగురు పాత బెల్ట్, సారాయి నిందితులపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. ఈ దాడుల్లో పొదలకూరు ఎక్సైజ్ ఎస్ఐ అంజయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మూడు నెలల్లో 20 కేసుల నమోదు

ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట మండలాల్లో అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై మూడు నెలల్లో 20 కేసులు నమోదు చేసి 261 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

### బెల్టు షాపుల సమాచారం ఇవ్వండి

నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలో ఎక్కడైనా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తుంటే వాటి సమాచారం తమకు అందచేయాలని రూరల్ ఎక్సైజ్ సీఐ ప్రసన్నలక్ష్మి ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. నెల్లూరురూరల్, వెంకటాచలం, మనుబోలు మండలాల్లో మద్యం అక్రమ విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గడిచిన మూడు నెలల్లో గంజాయి, బెల్టు షాపుల నిర్వహణపై 28 కేసులు నమోదు చేసి 28 మందిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. దాబాలపైనా గట్టి నిఘా పెట్టామన్నారు. ప్రజలు సమాచారాన్ని ఫోన్ నెం. 9440902512, 8106959005, 9676079798లకు తెలియజేయాలని కోరారు.

# అబ్దుల్ అజీజ్‌కు శుభాకాంక్షలు


అజీజ్‌ను సత్కరిస్తున్న సాబీర్‌ఖాన్

నెల్లూరు రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్‌అజీజ్‌ను పలువురు టీడీపీ నాయకులు అభినందించారు. మంగళవారం విజయవాడలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో అజీజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న నేపథ్యంలో నెల్లూరు రూరల్ టీడీపీ నాయకులు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. పార్టీ మైనార్టీ నాయకుడు పఠాన్ సాబీర్‌ఖాన్ మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

# పెన్షన్.. ఉద్యోగి ప్రాథమిక హక్కు

● విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు విద్యాసాగర్


జాతీయ పెన్షనర్ల దినోత్సవం కేక్ కట్ చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు, నాయకులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ అనేది ఉద్యోగి ప్రాథమిక హక్కు అని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కేఈసీ విద్యాసాగర్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని టౌన్‌హాల్లో జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పని చేసిన ఉద్యోగులు వృద్ధాప్యంలో ప్రశాంతంగా బతకడానికి అందిస్తున్న పెన్షన్ వచ్చేందుకు కారకుడు ధరమ్ స్వరూప్ నకారా అని తెలిపారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ హరిబాబు, ప్రధాన కార్యదర్శి కల్పం శ్రీనివాసులు, ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విడవలూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విడవలూరు వైద్యాధికారి కె.హరికృష్ణ తెలిపారు. విడవలూరు రామాలయం వీధిలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి హరికృష్ణ

### వైభవంగా మండల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వామి అయ్యప్ప దేవస్థానంలో మండల పూజలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం పాలాభిషేకం, గణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, నవకాభిషేకం, కలశ పూజ, ఉచ్ఛ పూజ, శ్రీవేలి ఉత్సవం, అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం పూలంగి సేవ, మహా దీపారాధన, భగవతి సేవ, అత్తాళం పూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర హారతులు జరిగాయి. ధర్మకర్తలు శేషగిరిరావు, వెంకటరత్నం, గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు.

### అఘోరి శ్రీనివాస్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు, క్రిస్టియన్లను ఊచకోత కోస్తామని హెచ్చరించిన అఘోరి శ్రీనివాస్‌పై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ముస్లింలు, క్రిస్టియన్లను ఊచకోత కోస్తామని, భారతదేశంలో లేకుండా చేస్తామంటూ గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో నాయకుడు, మైనారిటీ నేత సయ్యద్ సమీ హుస్సేనీ అలియాస్ షా హుస్సేనీ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పేరుకుపోతున్న చెత్త!



కోవూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన కోవూరు పట్టణం లోని పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకు పోయి పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక లక్ష్మీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పేరుకుపోతోన్న చెత్త వల్ల రోడ్డుపై నడచివెళ్లేందుకు వీలుకానంతగా దుర్వాసన వెదజల్లుతోంది. దీనిని తొలగించాలని పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని లక్ష్మీనగర్ వాసులు వాపోతున్నారు.

# రీసర్వే లోపాలపైనే అధిక శాతం అర్జీలు


ముత్తుకూరు : అర్జీలు స్వీకరిస్తున్న డీటీ శ్రీనివాసులు

ముత్తుకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో అధిక శాతం అర్జీలు భూముల రీ సర్వే లోపాలపైనే వస్తున్నాయి. మంగళవారం మండలంలోని పంటపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి డీటీ శ్రీనివాసులు అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సర్పంచు ఆలపాక శ్రీనివాసులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, తదికాగితాలపూరులో రెవెన్యూ సదస్సు

● మనుబోలు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగితాలపూరు సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి రీసర్వే డీటీ మంజుల అర్జీలు స్వీకరించారు. 8 మంది రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనువాసులు, వీఆర్‌వో బాషా తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలారా.. విత్తనాలు విత్తండిలా..!

పొదలకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరి సాగులో నారుమడి దశ ఎంతో కీలకం. ఈ దశలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే చాలా వరకు తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రబీ సీజన్ మొదలైనందున విత్తనాల హడావిడి మొదలైంది. విత్తనాల కొనుగోలులో కనీస జాగ్రత్తలు పాటించకుంటే నష్టపోయే అవకాశం ఉంది.

● **ఇలా చేయండి..**

ఏ రకం వేయాలో రైతు నిర్ణయించుకున్న తర్వాత గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలి. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన దుకాణాల నుంచే కొనుగోలు చేయాలి. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచి తీసుకోవడం మంచిది. బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, కంపెనీ పేరు, లేబుళ్లు, గడువుతేదీ, పరిణామం, విత్తనం ధర, అమ్మిన వారి సంతకం వంటివి ఉండాలి. విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్రం, బిల్లు పంట చేతికొచ్చే వరకు భద్రపరుచుకోవాలి. సంచులపై విత్తన ఉత్పత్తిదారుడు, విక్రయదారుడి పూర్తి చిరునామా, లాట్ నెంబరు ఉండాలి, పర్మిట్ నెంబరు గడువుతేదీ, సంచిపై ప్యాకింగ్, గడువు, విత్తన పరీక్ష తేదీలను గమనించాలి.

● **నారుమడి వేసే ముందు..**

ఎంచుకున్న విత్తనాలు కొన్నింటిని గ్లాసుతో తీసుకొని నానబెట్టాలి. అందులో వందలో 80 గింజలు మొలకెత్తితేనే విత్తనాలను నారుమడికి ఎంచుకోవాలి. విత్తనశుద్ధి చేసి విత్తనాలను వదులు సంచుల్లో ఉంచి నానబెట్టాలి. 24గంటల నీటిలో ఉంచి అనంతరం బయటకు తీసి గాలి తగలని ప్రదేశంలో మరో 24గంటలు ఉంచాలి. విత్తన శుద్ధికిగాను కిలో విత్తనానికి 3 గ్రాములు కార్బండిజం మన్ను కలిపి రెండు రోజులు ఉంచాలి. సెంటు స్థలంలో 5కిలోల చొప్పున విత్తనాలను సమానంగా చల్లుకోవాలి. నత్రజని చల్లిన తర్వాత 12 నుంచి 16 రోజుల మధ్యలో భాస్వరం, పొటాష్ ఎరువులను చల్లుకోవాలి. విత్తనం చల్లిన తర్వాత 26 నుంచి 30 రోజుల తర్వాత నారుని నాట్లుగా వేసుకోవాలి. ఇలా కనీస జాగ్రత్తలు తీసుకున్న నారుమడికి తెగుళ్లు వచ్చే అవకాశాలు తక్కువ.

● **ఫిర్యాదు చేయాల్సి వస్తే..**

విత్తన నాణ్యత, ప్రమాణాల కన్నా తక్కువ మొలక శాతం ఉండి పంట దిగుబడి ప్రభావితం చేసినట్లు భావిస్తే విత్తిన తేదీ నుంచి 10 రోజుల లోపు వ్యవసాయాధికారికి లేదా జిల్లా వ్యవసాయాధికారి ద్వారా జిల్లా విత్తన కమిటీకి లిఖిత పూర్వక ఫిర్యాదు చేయాలి. అప్పుడే నష్టపరిహారం చెల్లించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు.

# తుపాను చలిగాలులు

వణుకుతున్న జిల్లా

మరో రెండు రోజులూ ఇలాగే

నేడు, రేపు భారీ వర్ష సూచన



తుపాను హెచ్చరిక నేపథ్యంలో జిల్లాను చలిగాలులు ముట్టడించాయి. పగలు కూడా చీకటిగా మారి చలి వణికిస్తోంది. మంగళవారం కనిష్ట ఉష్ణోగ్రత 21 డిగ్రీలకు పడిపోయింది. పగటి సమయంలో గరిష్ట ఉష్ణోగ్రత 26 డిగ్రీలుగా నమోదైంది. ఫెంగల్ తుఫానుతో గత నెలాఖరులో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. పది రోజుల తేడాతో మరో వాయుగుండం ఏర్పడి తుఫానుగా మారింది. అప్పుడు కూడా రెండు రోజుల పాటు భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. ఇపుడు మళ్ళీ వాయుగుండం ఏర్పడడంతో సోమవారం నుంచే జిల్లాలో మబ్బులు కమ్ముకున్నాయి. చలిగాలులు వీస్తున్నాయి. మంగళవారం తీవ్రత మరింత పెరిగింది. రానున్న రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇదే విధంగా వుంటాయని వాతారణ శాఖ తెలియజేసింది. బుధవారం కనిష్ట ఉష్ణోగ్రత 22 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీలు వుంటుందని పేర్కొన్నారు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో బుధ, గురు వారాల్లో జిల్లావ్యాప్తంగా తేలికపాటి నుంచీ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

# ప్రాణం నిలిచింది!



25 ఏళ్ల యువకుడికి 50 ఏళ్ల వ్యక్తి గుండె అమర్చిన వైద్యులు

పద్మావతి హృదయాలయంలో విజయవంతంగా 17వ గుండె మార్పిడి శస్త్రచికిత్స

విమానం నుంచి అంబులెన్సులోకి గుండెను తీసుకొస్తున్న డాక్టర్లు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువకుడికి.. విశాఖకు చెందిన 50 ఏళ్ల మురళి గుండెను మంగళవారం తిరుపతిలోని పద్మావతి హృదయాలయంలో వైద్యులు అమర్చారు. గుండె మార్పిడి శస్త్రచికిత్స అవసరమైన ఈ యువకుడు ఆరు నెలల కిందట ఇక్కడి వైద్యులను సంప్రదించారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో యువకుడికి అన్ని పరీక్షలు నిర్వహించి అతడి వివరాలను జీవన్‌దాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఇక్కడ వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలో విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మురళికి బ్రెయిన్‌డెడ్ అయింది. అవయవదానానికి కుటుంబీకులు ముందుకు వచ్చారు. దీంతో మంగళవారం డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని కిమ్స్ ఆస్పత్రికి చేరుకొని ఉదయం 11 గంటల సమయంలో గుండె సేకరణను పూర్తి చేశారు. గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి ప్రత్యేక అంబులెన్సులో మధ్యాహ్నం 1.45 గంటలకు శ్రీపద్మావతి హృదయాలయానికి చేరుకున్నారు. దాదాపు 6 గంటల సేపు గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఇది 17వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స. ఆ యువకుడిని ప్రత్యేక ఐసీయూ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. మురళి కుటుంబ సభ్యులకు, గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసిన పోలీసులకు వైద్య బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

సూళ్లూరుపేట మండలం దవాదిగుంటలోని తుపాను షెల్టరు



రెండు నెలలుగా ఒకదాని వెంట ఒకటిగా తుపానులు విరుచుకుపడుతున్నాయి. జిల్లాలో 75 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. విశాలమైన పులికాట్ సరస్సు ఉంది. తీరంలోని 9 మండలాల్లో వందలాది గ్రామాలు ఉన్నాయి. జిల్లాకు వానలు కురిపించేదీ తుపానులే అయినా.. అక్టోబరు నుంచి డిసెంబరు దాకా ప్రజలు వణికిపోతారు. తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో చెప్పలేరు. తుపానులు విరుచుకుపడి అల్లకల్లోలం సృష్టించిన చరిత్ర ఈ ప్రాంతాలకు ఉంది. తీరప్రాంత ప్రజలు తుపానుల్లో తలదాచుకోవడానికి, ప్రాణాలు కాపాడుకోవడానికి తుపాను షెల్టర్లను నిర్మించారు. అయితే వాటి అతీగతీ పట్టించుకోవడం లేదు. కూలిపోయి, కంపాచెట్లు పెరిగిపోయి కనీస రక్షణ కల్పించలేని స్థితిలో ఇవి ఉన్నాయి. దీంతో చాలా చోట్ల అవసరకాలంలో ప్రభుత్వ బడులూ, కాలేజీలూ తుపాను షెల్టర్లుగా మారిపోతుంటాయి. ప్రజాప్రతినిధులు పట్టించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి సురక్షిత కేంద్రాలుగా వీటిని నిర్మించాల్సివుంది.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

# ఇవి కాపాడుతాయా?

## దారుణ స్థితిలో జిల్లాలోని తుపాను షెల్టర్లు



గోవిందపల్లిపాళెంలో

### వాకాడు: కాపాడలేని భవనాలు



చీమలపాడులో



దుగరాజపట్నంలో

వందకుపైగా ఉన్న గిరిజన కుటుంబాలు తుఫానుల సమయంలో తలదాచుకోవడానికి వాకాడు మండలం చీమలపాడులో తుఫాను షెల్టర్ నిర్మించారు. అయితే 15 ఏళ్ల కిందటే ఇది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సమీప గ్రామాలకు ప్రాణాలు అరచేతపట్టుకుని తరలిపోతుంటారు. కొత్త భవనం నిర్మించండి అంటూ కోరుతున్నా వీరి మొర ఆలకించే వారు లేరు. ఇదే మండలంలోని అందలమాల, వాలమేడు గ్రామాల్లో కూడా తుఫాను షెల్టర్లు కూలిపోయే స్థితిలో వున్నాయి. తూపిలిపాలెం మత్స్యకార గ్రామంలో అయితే తుఫాను షెల్టరు పూర్తిగా శిథిలమైపోయింది. 250 కుటుంబాలు తుఫాను వచ్చినపుడల్లా అతలాకుతలం అవుతుంటారు. ఇక దుగరాజపట్నంలోని తుఫాను షెల్టర్‌ను పంచాయతీ కార్యాలయంగా మార్చేశారు. ఇది కూడా శిథిలావస్థలో వుంది. ఉరుస్తోంది. 2017లో కొండూరుపాలెం, మనపాలెం మత్స్యకార గ్రామాల్లో కట్టిన తుపాను షెల్టర్లు మాత్రం ప్రజలను ఎంతోకొంత ఆదుకుంటున్నాయి.

### కోట: కూలిపోయేందుకు సిద్ధంగా

కోట మండలం దైవాల దిబ్బ గ్రామంలో తుఫాను షెల్టర్ ఏ క్షణంలోనైనా కూలిపోయే దుస్థితిలో వుంది. దీనితో పాటు గోవిందపల్లిపాలెం, శ్రీనివాసస్రతం, సిద్ధవరం, కర్లపూడి, శ్యామసుందరపురం, కొత్తపట్నం గ్రామాల్లోని తుఫాను షెల్టర్లు కూడా కూలిపోయే స్థితిలో వున్నాయి. ఈ కట్టడాలను 1986లో నిర్మించారు. అప్పటి నుంచీ మరమ్మతులు కూడా చేపట్టలేదు. వీటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించాల్సి ఉంది. అలాగే ఉత్తమ నెల్లూరు, వంజివాక, నెల్లూరు కొత్తపాలెం గ్రామాల్లో కూడా తుఫాను షెల్టర్లు అవసరం.

### చిల్లకూరు: అరక్షిత కేంద్రాలు



అద్దేపల్లిలో

చిల్లకూరు మండలం వరగలి గ్రామంలో 35 ఏళ్ళ కిందట కట్టిన తుపాను షెల్టర్ శిథిలమైంది. దీంతో జడ్పీ హైస్కూలును తాత్కాలిక పునరావాస కేంద్రంగా వాడుతున్నారు. అద్దేపల్లిలో 30 ఏళ్ళ కిందట కట్టిన తుఫాను షెల్టర్ సైతం దెబ్బతిని కూలిపోయే స్థితిలో వుంది. తుఫాన్ల సమయంలో గ్రామస్తులను సమీపంలోని తూర్పు కనుపూరు గ్రామానికి తరలిస్తున్నారు. మండలంలోని తూర్పు కనుపూరు, మోమిడి, కొమరవారిపాలెం, మన్నేగుంట, వేళ్ళపాలెం, బల్లవోలు గ్రామాల్లో కూడా షెల్టర్లు వున్నప్పటికీ అవి సైతం కూలిపోయేందుకు సిద్ధంగా వున్నాయి.

### తడ: భూతాల నిలయాలు



ఇరకంలో

తడ మండలం కారిజాత, వాటంబేడు గ్రామాల్లో తుఫాను షెల్టర్లు భూతాల నిలయాలను తలపిస్తున్నాయి. భవనాలు శిథిలమై లోపల అడుగుపెట్టే పరిస్థితి లేదు. ఈ రెండిటితో పాటు వేనాడు, ఇరకం, మాంబట్టులలో వున్న షెల్టర్లు కూడా పాతికముప్పై ఏళ్ళ కిందటివి. గత పదిహేనేళ్ళుగా మరమ్మతులకు నోచుకోలేదు. అన్నీ కూలిపోయేందుకు సిద్ధంగా వున్నాయి. వీటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించడంతో పాటు తడ, కాదలూరుల్లో కూడా షెల్టర్లు అవసరం.



కారిజాతలో

### దొరవారిసత్రం: పాములకు ఆవాసం



కారికాడులో

దొరవారిసత్రం మండలం వేలికాడు, కారికాడు గ్రామాల్లో 30 ఏళ్ళ కిందట తుఫాను షెల్టర్లు కట్టారు. ఆ భవనాలు శిథిలావస్థకు చేరాయి. తలుపులు, కిటికీలు సైతం లేవు. చెట్లు పెరిగిపోయి పాములకు ఆవాసంగా మారాయి.

### చిట్టమూరు: ఉపయోగపడితే కదా!

చిట్టమూరు మండలం బురదగాలి,పల్లంపర్తి,పిట్టి వానపల్లి గ్రామాల్లో తుఫాను షెల్టర్లు వున్నాయి.వీటిలో బురదగాలి, పల్లంపర్తి భవనాలను వినియోగించే పరిస్థితి లేదు.కూలిపోయే స్థితిలో వున్నాయి. కేవలం పిట్టివానపల్లి గ్రామంలోని భవనం మాత్రం నూతనంగా నిర్మించింది.

### సూళ్ళూరుపేట: ఆరు షెల్టర్లదీ అదే దారి

కుదిరిలో



సూళ్ళూరుపేట మండలం కడపత్ర, కొరిడి, కుదిరి, కేసీఎస్ గుంట, దావదిగుంట, గోపాల్‌రెడ్డిపాలెం గ్రామాల్లో షెల్టర్లు వున్నాయి. అయితే అన్నీ మూడు దశాబ్దాల కిందట నిర్మించినవి. శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎలాంటి వసతులూ లేవు. వీటి స్థానంలో కొత్త భవనాలు కట్టడంతో పాటు అదనంగా అటకానితిప్ప, సూళ్ళూరుపేటల్లో తుఫాను షెల్టర్లు కట్టాల్సిన అవసరముంది.

### నాయుడుపేట: ఇక్కడొకటి కట్టండయ్యా

నాయుడుపేట మండలంలో తుఫాను షెల్టర్లు లేవు. తుఫాన్లు సంభవించినపుడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టంగుటూరు ప్రకాశం పంతులు పాఠశాలలను తాత్కాలిక పునరావస కేంద్రాలుగా వాడుతున్నారు. కనీసం మండల కేంద్రంలోనైనా తుఫాను షెల్టర్లు నిర్మించాల్సిన అవసరముంది.



# రోడ్డు రోలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● రామానుజపల్లె వద్ద ఘటన ● బస్సులోని 39 మందికి, రోడ్డు రోలరులో ఒకరికి గాయాలు



రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె వద్ద మంగళవారం ఉదయం వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు రోలరును ఢీకొంది. బస్సులో 50 మంది ఉండగా 39 మంది.. రోడ్డు రోలరులో ఒకరికి.. మొత్తం 40 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం తెల్లవారుజామున బెంగళూరు నుంచి బయలుదేరింది. ఉదయం 8.35 గంటల ప్రాంతంలో తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె సర్కిల్ వద్దకు వచ్చింది. అదే సమయంలో చంద్రగిరి నుంచి తిరుపతి వైపు రోడ్డు రోలరు వెళుతోంది. అతి వేగంగా వచ్చిన బస్సు.. అదుపు తప్పి రోడ్డు రోలర్‌ను ఢీకొంది. దీంతో రోడ్డు రోలరు డివైడర్ పైకి వెళ్లి ఆగింది. ఈ ప్రమాదంలో చంద్రగిరి మండలం పిచ్చినాయుడుపల్లికి చెందిన జి.కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇక, బస్సు డ్రైవరు రవి, కండక్టరు ఈపీ రెడ్డి సహా 39 మందికి గాయాలయ్యాయి. తిరుపతి రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ, షేక్ షావలి, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్సులు, బస్సు ద్వారా ద్వారా బాధితులను తిరుపతి రుయాకు తరలించారు. ఆర్టీసీ అధికారులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు సహాయ సహకారాలు అందించారు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు దెబ్బతినగా.. రోడ్డు రోలర్ జంక్షన్ పాయింట్ కట్ అయింది. దీంతో ఇంజన్ నుంచి వెనుక భాగం వేరై డివైడర్ పైకి ఎక్కింది. బస్సు ఇంజన్ బాగా దెబ్బతింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ తప్పిదమే ప్రధాన కారణంగా పోలీసులు భావించి కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్సును సీజ్ చేశామని ఎస్‌ఐ రామకృష్ణ చెప్పారు. క్షతగాత్రులు రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుమార్‌తో పాటు రమేష్, శరవణ, ధర్మ, హనుమంతప్ప పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు.





దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందుభాగం - డివైడర్‌పైకి ఎక్కిన రోడ్డురోలరు

# రూ.3.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

● గుజరాత్‌లో గోడౌన్లపై దాడి చేసి పట్టుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు ● ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి

మంగళం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం పటాన్‌లోని గోడౌన్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి రూ.3.5 కోట్ల విలువైన 155 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. ఈ దుంగలను తిరుపతికి తీసుకొచ్చారు. కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎల్.సుబ్బరాయుడు మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. 'కొద్ది రోజుల కిందట అన్నమయ్య జిల్లా సానిపాయ వద్ద రాంప్రసాద్, రవిశంకర్ అనే స్మగ్లర్లను అరెస్ట్ చేశాం. వీరిని విచారించగా గుజరాత్‌కు చెందిన స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. దీంతో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఎండీ షరీఫ్ బృందం, గుజరాత్ పోలీసుల సహకారంతో పటాన్‌లోని గోడౌన్లపై దాడిచేశారు. గుజరాత్‌లోని దీసా పట్టణానికి చెందిన ఉత్తమ్‌కుమార్ నందకిషోర్‌సోనీ, జోషి హన్స్‌రాజ్, పఠాన్ పట్టణానికి చెందిన పరేష్ జి కాంతిఠాకూర్‌ను అరెస్ట్ చేశాం. ఐదు టన్నుల దుంగలను, ఒక కారుని సీజ్ చేశాం' అని టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి సుబ్బరాయుడు తెలిపారు. ప్రధాన స్మగ్లర్లను అరెస్ట్ చేసేందుకు దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరచిన టాస్క్‌ఫోర్స్ అధికారులను, సిబ్బందికి నగదు బహుమతి అందించారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్, ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎం.సురేష్‌కుమార్, ఎస్‌ఐ రఫీ తదితరులు పాల్గొన్నారు.




మంగళవారం ఉదయం శుభ్రపరిచారిలా..

## చెత్త తీసి.. కల్లాపు చల్లి!

అది తిరుపతి నగరం కొర్లగుంట జంక్షన్ నుంచి పాత కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి. ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతున్నా.. కొందరు స్థానికులు ఈ దారిలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు వద్ద చెత్త వేస్తున్నారు. ఎంత చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. చివరకు 'ఇచ్చట చెత్త వేయరాదు. వేసినచో రూ.1000 జరిమానా విధించబడును' అని కమిషనరు పేరిట హెచ్చరిస్తూ ఫ్లెక్సీ పెట్టారు. అయినా.. చెత్త వేయడం ఆపలేదు. చివరకు పారిశుధ్య సిబ్బంది వినూత్న ఆలోచనతో ముందుకొచ్చారు. మంగళవారం ఉదయానికంతా అక్కడ 'చెత్త'శుద్ధి చేశారు. పేడ నీటితో కల్లాపు చల్లారు. కుండీల్లో పూలమొక్కలు పెట్టారు. ఇలాగైతే స్థానికుల్లో మార్పు వచ్చి చెత్త వేయరన్న భావనతో ఈ పనులు చేశారు. పారిశుధ్య సిబ్బంది ఆశించిన ఈ మార్పు ప్రజల్లో వస్తే.. తిరుపతి స్వచ్ఛ నగరం అవుతుంది.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

## 17 ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్



అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ మంగళవారం రెవెన్యూ అధికారులకు వచ్చిన ఫిర్యాదుపై దాడి చేశారు. పోలీసుల సహకారంతో 17 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఆర్ఐ జైకృష్ణ తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి అందిన ఫిర్యాదు మేరకు తాము పిల్లపాళ్యం స్వర్ణముఖినది సమీపంలోని ప్రైవేటు భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు నిర్వహించామన్నారు. ఇసుక తరలిస్తున్న 7 ట్రాక్టర్లు, పది ఖాళీ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి గాజులమడ్యం పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వీఆర్వో విశ్వనాథం ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధాకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి






## సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమలలో స్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.36 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,112

తలనీలాలు సమర్పించినవారు: 22,541



# మీ కళ్లెదుట ప్రమాదం జరిగిందా?

### కాపాడినందుకు కోర్టుకు తిరగనవసరం లేదు
### పోలీసులూ, ఆసుపత్రుల వేధింపులుండవు
### కేంద్రం మార్గదర్శకాలు

తిరుపతి(నేరవిభాగం) ఆంధ్రజ్యోతి

రోడ్డు మీద ప్రమాదం జరుగుతుంది. రక్తగాయాల్లో చెల్లాచెదురుగా పడిపోయి ఉంటారు. ఆ దారినపోయేవారు కొందరు ఆగి చుట్టుముడుతారు. కొందరు దూరంగా ఉండి, వివరాలు కనుక్కుంటారు. మరికొందరు వెంటనే మొబైల్ బయటకు తీసి వీడియో తీస్తుంటారు. ఒకరో ఇద్దరో పూనుకుని 108కి ఫోన్ చేస్తారు.

... రోడ్డు ప్రమాదాల సమయంలో సాధారణంగా కనిపించే దృశ్యం ఇది. గాయపడ్డవారిని తక్షణం తామే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం మాత్రం దాదాపుగా ఎవరూ చేయరు. నిజానికి రోడ్డు ప్రమాద సంఘటనల్లో గోల్డెన్ అవర్ కీలకమైనది. అంటే ప్రమాదం జరిగిన గంటలోగా ఆసుపత్రికి చేర్చగలిగితే మరణాలను నిరోధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తమ వాహనంలోనో లేదా ఆటోలోనో ఆసుపత్రికి తీసుకువెళ్లే సాహసం జనం చేయరు. అరుదుగా ఏ నాయకులో, అధికారులో చేసినపుడు ఇది వార్త అవుతుంటుంది.



### ఎందుకిలా?

ఎందుకంటే మంచి చేసినా అది తమకు అంటుకుంటుందన్న భయం. సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్తే, తీసుకువెళ్లిన వారి వివరాలు రాసుకుంటారు. ఆ తర్వాత పోలీసు వేధింపులు మొదలవుతాయి. సవాలక్ష ప్రశ్నలు ఎదురవుతాయి. సాక్ష్యంగా కోర్టుకు రమ్మంటారు. మానవత్వంతో చేసిన సాయానికి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండాలా.. అన్న ఆందోళన వల్లే రోడ్డు ప్రమాద సంఘటనల్లో ప్రజల ఉదాసీనతకు కారణం. ఇటువంటి కారణాలను గుర్తించే కేంద్ర ప్రభుత్వం ఖచ్చితమైన మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ వివరాలను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలియజేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు మానవతా దృక్పథంతో తక్షణం సాయం అందించండి అని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

**కేంద్రం మార్గదర్శకాలు ఇవీ..**

- ప్రమాద బాధితులకు సహాయకారిగా వచ్చిన వ్యక్తిని ఆసుపత్రి సిబ్బందిగానీ, పోలీసులుగానీ వేధించకూడదు. బాధితుడిని తక్షణం ఆసుపత్రిలో చేర్చుకుని వైద్య సేవలు అందించాలి.
- సాక్ష్యం చెప్పండి అంటూ బలవంతం చేయకూడదు.
- సాక్ష్యం చెబుతామని ముందుకు వచ్చిన వారి విచారణ ఒక్క రోజులోనే ముగించాలి. రెండవసారి పిలవకూడదు.

"రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసిన వ్యక్తులకు గౌరవ సూచకంగా రూ 5000 పారితోషికం జిల్లా కలెక్టర్ ఇస్తారు. వారి సేవలను గుర్తిస్తూ యోగ్యతా పత్రం కూడా అందిస్తారు.



రాగిమాను వద్ద పెద్ద మర్యాద స్వాగత సత్కారాలు అందుకుంటున్న పెద్ద జీయర్ స్వామి

## పెద్దజీయర్ స్వామికి తిరునక్షత్ర మర్యాద

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పెరియ కోయిల్ కేల్వి అప్పన్ శఠగోప రామానుజ పెద్దజీయర్ స్వామి 75వ జన్మదినం సందర్భంగా మంగళవారం పెద్దజీయర్ స్వామికి ఆలయంలో తిరునక్షత్ర మర్యాద జరిగింది. రాగిమాను వద్ద ఇస్తికఫాల్ స్వాగతం లభించింది. మేళతాళాల మధ్య చిన్నజీయర్ స్వామితో కలిసి ఆయన ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ మహద్వారం వద్ద స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

## శ్రీవారిసేవలో ఎల్లా





ప్రీతి నిగమ్, నగేస్ కర్రా - ఎల్లా వెంకటేశ్వర్లు

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బొలిశెట్టి సత్యనారాయణ, సినీనటి ప్రీతి నిగమ్, నగేష్ కర్రా దంపతులు, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారుడు ఎల్లా వెంకటేశ్వర్లు ఉన్నారు.

# అ'దృశ్యం'

- భర్త కనబడలేదంటూ పోలీసులను ఆశ్రయించిన భార్య
- దర్యాప్తులో తీగ లాగితే డొంక కదిలిన వైనం
- వీడిన మర్డర్ మిస్టరీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నేరాలు, చోరీలు చేసి తాత్కాలికంగా కప్పిపుచ్చుకున్నా దొరికిపోక తప్పదు. అలా ఎలక్ట్రీషియన్ హత్య బయట పడటానికి 50 రోజులు పట్టింది. అదృశ్యం కేసుపై విచారణ చేపడితే హత్య విషయం వెలుగులోకి వచ్చింది. మర్డర్ మిస్టరీ కూడా వీడింది. శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి తెలిపిన ప్రకారం.. ఏర్పేడు మండలం పల్లం గొల్లపల్లికి చెందిన వెంకటేష్, వసంత దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలో కాపురం ఉంటూ స్వగ్రామానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని వచ్చేవారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ప్రభాకర్ పదేళ్ల కిందట ఎలక్ట్రీషియన్ పనుల కోసం శ్రీకాళహస్తికి వచ్చాడు. కొత్తపేటలోనే ఓ మిత్రుడితో కలిసి అద్దె గదిలో ఉంటున్నాడు. ఖాళీ రోజుల్లో ఇంటికి వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంలో వెంకటేష్ కుటుంబంతో ఇతడికి సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. వసంతతో చనువుగా మెలిగేవాడు. ప్రభాకర్, అతడి తరపు బంధువులు పలుమార్లు ఇద్దరిని మందలించినా మార్పు రాలేదు. దీని వల్ల వెంకటేష్, వసంత మధ్య విబేధాలు తలెత్తాయి. నాలుగు నెలల కిందట గొడవ జరగడంతో వెంకటేష్ స్వగ్రామానికి వెళ్లిపోయాడు. వసంత మాత్రం శ్రీకాళహస్తిలోనే ఉన్నారు. ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ కారణంగా తన భార్య దూరమైందని వెంకటేష్ ఆగ్రహం పెంచుకున్నాడు. తన భార్య సోదరుడైన ఆటో డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అల్లుడు హేమంత్‌కుమార్‌తో కలిసి అతడి అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. అక్టోబరు 24న ముగ్గురు కలిసి మద్యం తాగేందుకు రావాలంటూ శ్రీకాళహస్తిలో కొత్తపేట వద్ద ఎలక్ట్రీషియన్ ప్రభాకర్‌ను ఆటో ఎక్కించుకున్నారు. నలుగురూ మద్యం తాగారు. ఆటోలో పల్లం గొల్లపల్లి శివారులోని శ్మశానం సమీపంలోకి వచ్చేసరికి ప్రభాకర్.. నిద్రలోకి జారుకున్నాడు. ముగ్గురూ కలిసి బండరాయితో అతడి తలపై కొట్టి హత్య చేశారు. కాలువ పక్కన మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. నాలుగు రోజులైనా ప్రభాకర్ రాకపోవడంతో.. అద్దె గదిలో ఉండే మిత్రుడు ఆయన భార్యకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. తన భర్త ప్రభాకర్‌కోసం సుధ పలుచోట్ల ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో నవంబరు 25న శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వసంతతో సన్నిహితంగా మెలిగేవాడన్న విషయాన్ని గుర్తించారు. ఆ తరువాత లోతుగా కూపీ లాగడంతో ఆమె భర్త, సోదరుడు, అల్లుడు కలిసి ప్రభాకర్‌ను చంపినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని ప్రభాకర్ అవశేషాలను వెలికి తీసి.. అక్కడే ప్రభుత్వ వైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ముగ్గురు నిందితులు ఓ రెవెన్యూ అధికారి వద్ద లొంగిపోయినట్లు తెలిసింది. మొత్తమ్మీద అ'దృశ్యం' కేసులో దర్యాప్తు చేపడితే మర్డర్ మిస్టరీ వీడింది. సినిమా తరహాలో మృతదేహాన్ని పాతిపెట్టడం చర్చనీయాంశంగా మారింది.



మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు -ప్రభాకర్ (ఫైల్ ఫొటో)

## బ్యాంకులో దోపిడీకి యత్నం

- యువకుడిని పట్టుకుని చితకబాదిన ఖాతాదారులు



రేణిగుంట డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో దోపిడీకి యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని కట్టేసి చితకబాదారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం తిరుపతి- రేణిగుంట రోడ్డులోని ఇండియన్ బ్యాంకులో జరిగింది. కృష్ణతేజ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న ఈ బ్యాంకులోకి సాయంత్రం మూసివేసే సమయంలో ఓ యువకుడు ముఖానికి కర్చీఫ్ కట్టుకుని, బ్యాగులో కత్తిని పెట్టుకుని ప్రవేశించాడు. క్యాషియర్ పక్కన ఉన్న అకౌంటెంట్ మెడపై కత్తి పెట్టి డబ్బులు బ్యాగులో వేయాలని బెదిరించాడు. అదే సమయంలో బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు ఆ యువకుడిని మాటల్లో దింపి చాకచక్యంగా పట్టుకున్నారు. బయటకు తీసుకొచ్చి గ్రిల్‌కు కట్టేసి చితకబాదారు. తాను రూ.5 లక్షల అప్పుల పాలయ్యానని, ఆ బాధ తట్టుకోలేక చోరీకి వచ్చినట్టు అతడు చెప్పాడు. తాను లక్ష్మీపురం సర్కిల్‌లో ఉంటానని, శ్రీకాళహస్తి ఆలయం సమీపంలో ఇల్లు ఉందని, డిగ్రీ వరకు చదువుకున్నానని చెప్పాడు. తిరుచానూరు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఆ యువకుడి పేరు పురుషోత్తం అని పోలీసుల విచారణలో తేలింది. వరదయ్యపాలెం మండలం సదనవారిపల్లెకు చెందిన వాడని పోలీసులు తెలిపారు. మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేసే ఇతడిని.. ఆర్థిక వ్యవహారాల్లో ఉద్యోగం నుంచి తొలగించారు. బ్యాంకు అప్రైజరును బెదిరించిన కేసులో పురుషోత్తంను అరెస్టు చేశారు. గతంలో ఇతడిపై ఎటువంటి నేరచరిత్ర లేదని సీఐ సునీల్‌కుమార్ వెల్లడించారు.

## షార్‌లో ఆక్టోపస్ బృందం



ఆక్టోపస్ బృందంతో తహసీల్దార్ నరసింహరావు, ఎస్ఐ శ్రీకాంత్

సూళ్లూరుపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌కు మంగళవారం ఆక్టోపస్ బృందం చేరకుంది. డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో 52మంది ఆక్టోపస్ సిబ్బంది షార్ పరిధిలో ఉన్న సముద్ర మార్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు.తీవ్రవాదులు షార్‌లోకి ప్రవేశించినప్పుడు,సముద్ర మార్గం గుండా చొరబాటుదారులు వచ్చినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలో ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించనుంది. ఆక్టోపస్ బృందానికి తహశీల్దార్ ఎస్.వి.నరసింహరావు, శ్రీహరికోట ఎస్ఐ శ్రీకాంత్ స్వాగతం పలికారు.

## 'వైష్ణవి'కి కార్మికుల కాపలా

- మద్దతు తెలిపిన టీడీపీ నేతలు

పెళ్లకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైష్ణవి డెయిరీని యాజమాన్యం వదిలేసి వెళ్లడంతో కార్మికులు, ఉద్యోగులు షిఫ్టుల విధానంలో కాపలా కాస్తున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యి కల్తీ చేశారనే కేసులో సిట్ బృందం ఇక్కడకు వచ్చి విచారించడం.. ఉద్యోగులను, కార్మికులను వదిలి యాజమాన్యం వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం కంపెనీ వద్దకు కార్మికులు, ఉద్యోగులు వెళ్లగా.. సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. దీంతో పరిశ్రమకు కాపలా ఉండి ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని భావించిన కార్మికులు రెండు షిఫ్టులుగా అక్కడ ఉంటున్నారు. స్థానిక టీడీపీ నాయకులు వేలూరు హరినాయుడు, తాళ్ల యుగందర్‌గౌడ్ మంగళవారం వీరికి మద్దతు తెలిపారు. కాగా, సోమవారం యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు తన సిబ్బందితో కలసి కంపెనీని సందర్శించి.. పరిశీలించారు.



కార్మికులకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

## విష జ్వరంతో విద్యార్థి మృతి

- పూడి వంతెన కొట్టుకుపోవడంతో ఇంట్లోనే చికిత్స
- ఆరోగ్యం విషమించి అసువులుబాసిన ఉదయ్



ఉదయ్‌కుమార్ (పాతచిత్రం)

కేవీబీపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం పూడి సీకే పురం గ్రామానికి చెందిన విద్యార్థి విష జ్వరంతో మృతి చెందాడు. చిట్టిబాబు, హేమలత దంపతుల రెండో కుమారుడు ఉదయ్‌కుమార్(14) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామం వద్ద కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో ఇంటి వద్దే అందుబాటులో ఉన్న మందులతో సరిపెట్టారు. శనివారం జ్వరం ఎక్కువ కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్దామని బయలు దేరారు. యేరు ఉధృతంగా పారుతుండడంతో వెనుదిరిగారు. ఆదివారం తాత్కాలికంగా వంతెన పునరుద్ధరించడంతో కేవీబీపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షల అనంతరం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. తిరుపతిలో వైద్యం పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయ్‌కుమార్ రాగిగుంట పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

### ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో
## ఇద్దరికి ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా

మంగళం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటూ ఒక్కొక్కరికి రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు తిరుపతి న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పునిచ్చినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తిరుపతి అటవీరేంజ్‌లోని తిమ్మినాయుడుపాలెం బీట్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతూ పూతలపట్టుకు చెందిన పులికంటి శ్రీరాములు, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన దాసరి రమణయ్యపై టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులకు ఐదేళ్ల జైలుశిక్షతోపాటూ ఒక్కొక్కరికి రూ.6 లక్షల జరిమానా విధించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారికి ఈ తీర్పు గుణపాఠంగా నిలుస్తుందని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడే వారికి ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా జీవితకాలం వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. శిక్షపడ్డ ఇద్దరినీ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

## నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేస్తే పదేళ్ల జైలు శిక్ష

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం నకిలీ గుర్తింపు కార్డులు తీసుకొచ్చినా.. గుర్తింపు కార్డుల్లో కేడర్ మార్చినా, ఒకరి స్థానంలో మరొకరు వచ్చినా పదేళ్ల జైలు శిక్ష పడుతుందని తిరుమల పోలీసులు మంగళవారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. కన్నియకుమారికి చెందిన రిటైర్ట్ లెఫ్టినెంట్ కల్నల్ విశ్వేశ్వరప్రసాద్ ప్రస్తుతం సౌత్‌జోన్ మిలటరీ క్యాంటీన్లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈయన స్వామి దర్శనం కోసం కొందరిని సంప్రదించగా.. ఇతడి గుర్తింపుకార్డును వీరు బ్రిగేడియర్ అధికారిగా నకిలీది సృష్టించి బ్రేక్ దర్శన టికెట్లను పొంది విక్రయించారు. ఈఅక్రమాన్ని సోమవారం గుర్తించిన విజిలెన్స్ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఈ ప్రకటన విడుదల చేశారు.

## పీఎఫ్ జమచేయలేదని..

- ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ల విధుల బహిష్కరణ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీఎఫ్ నగదు జమ చేయలేదని తిరుమల ఘాట్‌లో నడిచే ఆర్టీసీకి చెందిన 50 ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు మంగళవారం విధులు బహిష్కరించారు. ఉదయం 6గంటలకు బయల్దేరాల్సిన బస్సులు అలిపిరి డిపోకే పరిమితమయ్యాయి. ఎలక్ట్రిక్ బస్సులను నిర్వహణ చూసే పాత, కొత్త సంస్థలతో ఇంచార్జ్ డీపీటీవో జగదీష్, డిపో మేనేజర్ హరిబాబు చర్చించారు. పదిరోజుల్లో పీఎఫ్ జమ చేయిస్తామని డ్రైవర్లకు హామీ ఇచ్చారు. పాత బకాయిల సమస్యను కూడా పరిష్కరించడంతో మధ్యాహ్నం 3గంటల డ్రైవర్లు విధులకు హాజరయ్యారు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులను చెన్నై, వేలూరులకు పంపకుండా తిరుమల-తిరుపతి మధ్య తిప్పారు.



అలిపిరి డిపోకే పరిమితమైన ఎలక్ట్రిక్ బస్సులు

## ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి రహదారి భద్రతపై ఆయన అధికారులతో సమీక్షించారు. తనపల్లి జంక్షన్, ఆర్‌సీపురం జంక్షన్, వకుళమాత జంక్షన్ తదితర ప్రాంతాల్లో సోలార్ బ్లింకర్లు, సైన్‌బోర్డు సూచికలు, పాదచారులు రోడ్డు దాటేందుకు మార్కింగ్, సోలార్ హైమాస్ట్ లైట్లు సత్వర ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భాకరాపేట ఘాట్‌తో పాటు జిల్లాలో సుమారు 100 ప్రమాదకర రహదారి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. నగరంలో ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో భారీ వాహనాలను అనుమతించే సమయ నిబంధనలను నిర్ధారించేందుకు రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా సమీక్షించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్, పోలీసు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే, హైవే భూసేకరణ వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వేప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి పనుల పురోగతిపై జేసీ శుభంబన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. భూసేకరణలో వచ్చే సమస్యలను ఎప్పటికపుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎన్‌హెచ్ఏఐ పీడీలు, గూడూరు సబ్‌కలెక్టరు రాఘవేంద్ర మీనా, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, సంబంధిత మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ టెక్నీషియన్ నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్‌పై నైపుణ్య శిక్షణ

తిరుపతి(విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్వి కాస్యోజన (పీఎంకేవీవై)4.0 ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు పరిశ్రమలకు కావల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా స్కిల్‌హబ్‌లలో శిక్షణ, ఉపాధి అవకాశాలను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కల్పిస్తోందని తెలిపారు. జిల్లాకు చెందిన స్కిల్‌హబ్ ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 'అసిస్టెంట్ టెక్నీషియన్ - నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజి' కోర్సుకు సంబంధించి శిక్షణ ప్రారంభించినట్టు వెల్లడించారు. 210 గంటల కాలవ్యవధి కలిగిన ఈ కోర్సుకు 10వ తరగతి, ఆపైన విద్యార్హతలు కలిగివారు అర్హులన్నారు. 81435 76866, 99851 29995 నంబర్లలో సంప్రదించాలని, అలాగే, forms.gle/XeQyn5D7DUWHd3sd6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

## పది నెలల బాలుడి గొంతులో ఇరుక్కున్న బ్యాటరీ

- స్విమ్స్‌లో శస్త్ర చికిత్సతో తొలగింపు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రిమోట్‌లకు ఉపయోగించే బ్యాటరీతో పది నెలలు బాలుడు ఆడుకుంటూ మింగడంతో గొంతులో ఇరుక్కుపోయింది. స్విమ్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి బ్యాటరీని తొలగించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన ఈ బాలుడిని కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తీసుకొచ్చారన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యుల పర్యవేక్షణలో అధునాతన వైద్య పరిజ్ఞానంతో బాలుడికి శస్త్ర చికిత్స చేశామన్నారు. అనంతరం బాలుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో మంగళవారం బాలుడ్ని డిశ్చార్జి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటరామిరెడ్డి, చంద్రమౌళీశ్వరన్, మనోజ్‌కృష్ణ, తేజస్విని, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులకు 988 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 53 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 988 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. భూ ఆక్రమణలపై 29, ఇళ్ల స్థలాలపై 124, అసైన్‌మెంట్ భూములపై 83, క్యాస్ట్ వెరిఫికేషన్ 15, రీసర్వే 21, ల్యాండ్ గ్రాబింగ్ 2, ఆర్‌వోఆర్‌పై 473, ఇతర విషయాలకు సంబంధించి 167 వచ్చాయన్నారు. వాటిలో 15 అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ప్రశాంత జీవనం సాగించాలన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలుస్తామని, ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. అనంతరం పలువురు పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, మహబూబ్ బాషా, మోహన్, శ్రీనివాసులు, అరుణ్‌కుమార్, సురేష్‌కుమార్, భాస్కర్ రావు, పురుషోత్తం, గోను శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక కేంద్రాల్లో పోస్టుల భర్తీకి చర్యలు


గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎఫ్‌వో రమణయ్య

కోట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న 11 అగ్నిమాపక కేంద్రాల్లో 60 ఫైర్‌మెన్, 10 డ్రైవర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వాటిని త్వరలో భర్తీ చేస్తారని జిల్లా అగ్నిమాపక అధికారి జే.రమణయ్య తెలిపారు. కోటలోని అగ్నిమాపక కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఫైర్ ఇంజన్లను పరిశీలించారు. అనంతరం డీఎఫ్‌వో మాట్లాడుతూ 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో పలు పరిశ్రమల నుంచి రూ.40 లక్షల టీఎస్‌ఆర్ నిధులను అగ్నిమాపక కేంద్రాల అభివృద్ధికి వెచ్చించామన్నారు. ఇందులో గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, కోట, అగ్నిమాపక కేంద్రాలకు రూ.16.5 లక్షల వ్యయంతో బోట్‌లు, రోప్‌లను అందించామన్నారు. కొత్తగా చంద్రగిరి, భాకరాపేటలో అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక అధికారి హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోండి



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని బూదనం గ్రామంలో ఓ పరిశ్రమకు చెందిన వారు అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణాన్ని అధికారులు అడ్డుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూదనం గ్రామంలో ఓ పరిశ్రమకు చెందిన వారు పంచాయతీ అనుమతి లేకుండానే మేత పొరబోకు స్థలంలో అక్రమంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని అన్నారు. దీని వల్ల పైప్రాంతాల్లో పడిన వర్షపు నీరు చెరువులోకి వెళ్లేందుకు వీలు లేకుండా పోతుందన్నారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, వేమయ్య, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న వేలూరు మురళీకృష్ణారెడ్డి, పక్కన తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి, ఇతర అధికారులు

పెళ్లకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్‌ఐ సంతోషీబాయి, వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ, వీఆర్వోలు మోబీనా, రమేష్, వంశీకృష్ణ, నాయకులు సుందరరామిరెడ్డి, సర్పంచు గుంటపూడి పెంచలయ్య, ఉప సర్పంచు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు

బాలాయపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని హస్తకావేరి, కామకూరు గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బి నమోదు కోసం 17, పక్కాగృహం మంజూరు, సాగుభూమికి హక్కులు కల్పించాలని ఒకటి చొప్పున వినతులు అందాయి. ఆర్‌ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు పాల్గొన్నారు.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు గ్రామంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇళ్ల స్థలాలు, సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు, సర్వే తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు.

తడ(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భీములవారిపాళెం, పెరియవట్టు గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ శరత్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. మొత్తం 20 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, సర్పంచు గీతాప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందాం, ఏనుగువాడ గ్రామాల్లో మంగళవారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు తమ భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. అలాగే కుందాం గ్రామానికి చెందిన గిరిజనులు అసైన్‌మెంటు భూములు ఇవ్వాలని తహసీల్దారును కోరారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దారు జయజయరావు, డిప్యూటీ తహసీల్దారు అజమతుల్లాఖాన్, ఆర్‌ఐ మధులత రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, తెలుగు రైతు కార్యదర్శి నెల్లూరు మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణ, సర్పంచు ప్రసూన పాల్గొన్నారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపిలిపాళెంలో తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తూపిలిపాళెం, గంగన్నపాళెం, జెమినీకొత్తపాళెం తదితర గ్రామాల పరిధిలోని ప్రజలు పలు సమస్యలపై 75 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అయోధ్య బాలచంద్రశెట్టి, మహేంద్ర, విశ్వనాథం, పామాంజి గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక 3వ సచివాలయంలో తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇళ్లు, రేషన్ కార్డులు, సర్వే కోసం ప్రజలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజేష్, సర్వేయర్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

## నేత్రదానం


వెంకటరాజు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం సూళ్లూరుపేట పట్టణం సూళ్లూరు నాగరాపురంలో నివాసం ఉంటున్న ఓంకారం వెంటకరాజు(90) మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంలో ఆయన కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు. దీంతో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 450కి చేరింది. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, అలపాటి అశోక్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలను టీడీపీలో చేర్చుకోం: కురుగొండ్ల


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ, పక్కన బీజేపీ నేత ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, టీడీపీ నేత రావి మస్తాన్‌నాయుడు, జనసేన నేత తోట కృష్ణయ్య

వెంకటగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి ఆరు నెలలు తిక్కముందే కొంతమంది వైసీపీ శ్రేణులు సిగ్గు విడిచి టీడీపీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పార్టీలో చేరుతున్నట్లు మీడియా ద్వారా ప్రకటించుకోవడం సిగ్గుచేటని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తమ కార్యాలయాలకు రావద్దని పదేపదే చెబుతున్నా కొంతమంది వైసీపీ నేతలు గుంపులో కలిసిపోయి వచ్చి తనకు శాలువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. తన ఇంటికి వైసీపీ నేతలెవ్వరూ రావద్దని, వచ్చినా పార్టీలో చేర్చుకొనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు వచ్చి తనకు కండవా కప్పుతుంటే టీడీపీ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారని, తమకు సంస్కారం ఉంది కాబట్టే వారిని ఏమీ అనకుండా పంపించి వేస్తున్నామని చెప్పారు. అభివృద్ధిలో పార్టీల కతీతంగా పనిచేస్తామే కానీ వైసీపీ నేతలను మాత్రం టీడీపీలో చేర్చుకొనే ప్రసక్తే లేదన్నారు. టీడీపీలో కష్టపడి పనిచేసిన వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. ఎన్నికలకు ముందు తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలపై చట్టం ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో బీజేపీ నేత ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, టీడీపీ నేతలు రావి మస్తాన్ నాయుడు, జనసేన నేత తోట కృష్ణయ్య పాల్గొన్నారు.

# ఇంధన పొదుపుతో భావితరాలకు వెలుగులు


సూళ్లూరుపేటలో ఇంధన పొదుపు వారోత్సవాలను ఆవిష్కరిస్తున్న ఈఈ శ్రీనివాసులు, ఏడీఈ శేఖర్, ఏఈలు మురళి, జగదీష్


వెంకటగిరి సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రవిచంద్ర, ఏఈలు జయచంద్రారెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, అశోక్

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంధనాన్ని పొదుపుగా వినియోగించి భావితరాలకు వెలుగులు పంచుదామని నాయుడుపేట డివిజన్ డిస్కం ఈఈ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సూళ్లూరుపేట డిస్కం కార్యాలయం వద్ద జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఇందన పొదుపు వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపు చేసేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ శేఖర్, ఏఈలు మురళి, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకేంద్ర వద్దనున్న విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మునిరవిచంద్ర మాట్లాడుతూ నేటి విద్యుత్ పొదుపే రేపటి భావితరాల వెలుగులకు సాకారం అవుతుందన్నారు. ఇంటి నిర్మాణాల్లో వాడే వైర్లు, ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి నాణ్యమైనవి ఉపయోగిస్తే విద్యుత్ పొదుపు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఒక ఏసీ 30 ఫ్యాన్‌లతో సమానమని తెలిపారు. అవసరాన్ని బట్టి ఏసీ వాడుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం లబ్ధిదారులకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈలు జయచంద్రారెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, అశోక్, జూనియర్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన వారికి విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులు బహుమతులు, మొమెంటోలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ వర్మ, డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు నెలబల్లి విద్యార్థులు


జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిల్లకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు నెలబల్లి రెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14,15 తేదీల్లో సత్యసాయి జిల్లా, కదిరిలో జరిగిన జంప్‌రోప్ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులకు పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ మస్తాన్ బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జగదీష్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు ఇంటి వద్ద మంగళవారం ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు, తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 60 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో విశ్రాంత సమయంలో మోకాళ్ళ, వెన్ను సమస్యలతో పాటు చిన్నపిల్లలకు పలు రకాల వ్యాధులకు చికిత్స చేస్తున్నామని చెప్పారు. ఈనెల 26న కూడా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కొండ చిలువ దాడిలో పెంపుడు కుక్క మృతి


మృతి చెందిన కుక్క

కోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోట మండలం మద్దాలిలో మంగళవారం తెల్లవారుజామున కొండచిలువ హడలెత్తించింది. స్థానికుల కథనం మేరకు... మద్దాలిలో వెంకటేశ్వర్లు అనే రైతు స్థానికంగా ఉన్న చెరువు పక్కన ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వెంకటేశ్వర్లు తన పెంపుడు కుక్కను ఇంటి బయట వదిలి లోపల నిద్రించాడు. తెల్లవారుజామున కుక్క అరుపులు వేయడంతో వెంకటేశ్వర్లుకు బయటకు వచ్చి చూడగా పెద్ద కొండచిలువ కుక్క తలను మింగుతూ ఉండటాన్ని గుర్తించి భయాందోళనకు గురయ్యాడు. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఘటనాస్థలికి చేరుకోవడంతో కొండచిలువ ఒక్కసారిగా కుక్కను వదిలేసి పక్కనే ఉన్న చెరువులో దూకి నీళ్లలోకి జారుకుంది. అప్పటికే కుక్క చనిపోయి ఉంది.

## తాళం వేసివున్న ఇంట్లో చోరీ

తడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రద్దగుంట గ్రామానికి చెందిన రవి కుటుంబం సోమవారం రాత్రి సమయంలో ఇంటి సమీపంలోని ఓ గదిలో నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో దొంగలు తాళాలను పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న సుమారు 20 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం బాధితులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అదుపుతప్పి కారు బోల్తా

చిట్టమూరు, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మొలకలపూడి మలుపు వద్ద మంగళవారం సాయంత్రం ఓ కారు బోల్తా కొట్టింది. చెన్నై ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు మంగళవారం ఉదయం తూపిలిపాళెం బీచ్‌కు వెళ్లారు. పూటుగా మద్యం సేవించిన యువకులు తిరుగు ప్రయాణంలో అతి వేగంగా కారు నడపుతుండగా మొలకలపూడి మలుపు వద్ద అదుపు తప్పి అడవిలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న యువకులకు స్వల్ప గాయాలయ్యాయి.

## చంద్రబాబు రైతు పక్షపాతి: నెలవల


నెలవల సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న పెళ్లకూరు మండలంలోని కూటమి నాయకులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల పక్షపాతి అని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి పెళ్లకూరు మండలంలో సాగునీటి సంఘాల అభ్యర్థులుగా గెలిచిన ఐదుగురు బీజేపీ అభ్యర్థులు నెలవల సుబ్రహ్మణ్యంను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పెళ్లకూరు మండలం టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, కూటమి నాయకులు ఎద్దల నరేంద్రరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుబ్బులయ్య, మురళీ, నరసింహ, రవి, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో భాగస్వాములు కండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు, పక్కన ఎంపీపీ ధనలక్ష్మి, ఉపాధి ఏపీడీ వరప్రసాద్, ట్రైనింగ్ అధికారి వెంకటేశ్వర్లు

నాయుడుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పంచాయతీల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనలక్ష్మి, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీడీ వరప్రసాద్, ట్రైనింగ్ లింక్ అధికారి వెంకటేశ్వర్లు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించుకొని వాటి కృషికి ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి) స్థానిక వెలుగు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్ కుమార్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్ రాజు, పీడీపీవో షంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలనుసాధించాలని ఎంపీడీవో కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజా తదితరులు పాల్గొన్నారు.

కోట (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీలో సుస్థిరాభివృద్ధి సాధనకు ఏఏ అభివృద్ధి పనులు చేయాలో వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట, నెల్లూరు మెమొ రైళ్ల వేళల్లో మార్పులు

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి బయల్దేరే మెమొ రైళ్లలో మార్పులు చేసినట్టు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- మూర్ మార్కెట్ కాంప్లెక్స్-సూళ్లూరుపేట మెమొ తెల్లవారుజామున 5.15 గంటలకు బదులు 5.40 గంటలకు బయల్దేరుతుంది.
- నెల్లూరు-సూళ్లూరుపేట మెమొ ఉదయం 10.05 గంటలకు బదులు 10.30 గంటలకు బయల్దేరుతుంది.
- మూర్ మార్కెట్ కాంప్లెక్స్-గుమ్మిడిపూండి సబర్బన్ రైలు తెల్లవారుజామున 5.40కు బదులు 5.20 గంటలకు బయల్దేరుతుందని, ఈ మార్పు మంగళవారం నుంచి అమలుకు వచ్చిందని దక్షిణ రైల్వే తెలిపింది.

## పక్షుల పండుగ నిర్వహణపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే విజయశ్రీ చర్చ


కలెక్టర్ వెంకటేశ్వర్, టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా అధికారి జనార్దన్ రెడ్డి, డీఎఫ్‌వో హారికతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా జరిగే పక్షుల పండుగ నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా అధికారులతో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం చర్చించారు. ఏటా నిర్వహించే పక్షుల పండుగను వైసీపీ హయాంలో నాలుగేళ్ల పాటు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే విజయశ్రీ పక్షుల పండగ నిర్వహణకు నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబుకు రెండుసార్లు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు టూరిజం శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్, జిల్లా టూరిజంశాఖ అధికారి జనార్దనరెడ్డి, సూళ్లూరుపేట డీఎఫ్‌వో ఈ.హారికతో సమావేశమైన ఎమ్మెల్యే పక్షుల పండుగ నిర్వహణపై చర్చించారు.

## విశ్రాంత ఉద్యోగుల భవనానికి బీరువా వితరణ


విశ్రాంత ఉద్యోగుల భవనానికి బీరువా అందజేస్తున్న వెంకటేశ్వర్లు, పక్కన పేర్నాటి కిరణ్, అలైక్య దంపతులు, విశ్రాంత ఉద్యోగులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆకుతోట వీధిలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల భవనానికి విశ్రాంత అధ్యాపకుడు పేర్నాటి వెంకటేశ్వర్లు బీరువాను వితరణ చేశారు. వెంకటేశ్వర్లు సతీమణి, విశ్రాంత ఎంఈవో వేళాంగిణి జ్ఞాపకార్థంగా మంగళవారం పెన్షన్ల దినోత్సవం సందర్భంగా రూ.12 వేల విలువచేసే బీరువాను వితరణ చేశారు. కార్యక్రమంలో పేర్నాటి కిరణ్, అలైక్య దంపతులు, ఉదయశంకర్, హెచ్.సుబ్రహ్మణ్యం, కె.సుబ్రహ్మణ్యం, సుబ్రహ్మణ్యం యాదవ్, గల్లా ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## వేగ నియంత్రణకు బ్యారికేడ్ల ఏర్పాటు

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం జాతీయ రహదారిపై హోలీక్రాస్ సర్కిల్ వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. మంగళవారం ఎస్‌ఐ బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు జాతీయ రహదారిపై బ్యారికేడ్స్ ఏర్పాటు చేశారు. బ్యారికేడ్స్ ఏర్పాటు చేయడం వల్ల వాహనాలు నెమ్మదిగా వెళతాయని, తద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని ఎస్‌ఐ అన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు


పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ రమణకుమార్

చిట్టమూరు, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): గూడూరు డీఎస్పీ రమణకుమార్ మంగళవారం చిట్టమూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాల పురోగతిపై ఆరా తీశారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని, వచ్చిన ఫిర్యాదులపై సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం సిబ్బందితో డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న బలరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ పెన్షనర్లకు సన్మానం


బెన్నిఫిలిప్స్‌ను సత్కరిస్తున్న పెన్షనర్స్

నాయుడుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్స్ డే సందర్భంగా మంగళవారం సీనియర్ పెన్షనర్ బెన్నిఫిలిప్స్(94)ను స్థానిక బేరిపేటలోని ఆమె నివాసంలో ఆ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఉదయశంకర్, పేర్నాటి వెంకటేశ్వర్లు, మునగాల కృష్ణారావు, కాలేషా, హెచ్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను మంగళవారం సూళ్లూరుపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద కాంగ్రెస్ నాయకుడు వెంకటాచలపతి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు షర్మిల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్దెపూడి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.